ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: 9440897445, 8074636674

గురువారం 23 ఏప్రిల్ 2026 | సంపుటి: 28 సంచిక: 29 | Thursday 23 April 2026 | Vol.No 28 Issue No .29 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్,హరీష్‌లకు ఊరట



## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్,ఏప్రిల్22 :కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను మిగతా2లో..



## అన్ని మతాచారాలను ఒకే గాటన కట్టలేం

- వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యం కూడా ముఖ్యం
- శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం కేసు విచారణ
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

మిగతా2లో..

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

- కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం



హైదరాబాద్,ఏప్రిల్ 22 : నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లోఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన మిగతా2లో..

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

- హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
- తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
- సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్



మిగతా2లో..

హైదరాబాద్,ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు.

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

- హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్,ఏప్రిల్22 :ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మిగతా2లో..



## కాళేశ్వరం కథ ముగియలేదు

- సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు
- బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో
- మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,ఏప్రిల్ 22 : కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు



మిగతా2లో..

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్

హైదరాబాద్,ఏప్రిల్ 22 : కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్



మిగతా2లో..

## అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ



హైదరాబాద్,ఏప్రిల్ 22 : తెలంగాణలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిలు ఉన్నా అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారాయని కేబినెట్ దృష్టికి వచ్చింది. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్‌ఫ్రా అండ్ క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ బుధవారంసచివాలయంలో సమావేశమైంది. ఈ మిగతా2లో..

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం
- అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు
- ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టిన హైకోర్టు తీర్పు
- విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్ 22: కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు



మిగతా2లో..

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

- వెంటనే సమ్మె విరమించి రండి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



హైదారబాద్,ఏప్రిల్22 :ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని మిగతా2లో..

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రీగా తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి



### డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

- ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు
- సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జెఎసి

హైదరాబాద్,ఏప్రిల్22 : చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో మిగతా2లో..

## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు



వాషింగ్టన్,ఏప్రిల్22 : ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల మిగతా2లో..

## మాజీ సిఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

- చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత
- మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం

హైదరాబాద్,ఏప్రిల్22 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ మిగతా2లో..



## పిఠాపురం ఘటనపై సిఎం చంద్రబాబు సీరియస్

- మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై అసహనం
- వర్మతో మాట్లాడాలని పల్లాకు బాబు ఆదేశం

అమరావతి,ఏప్రిల్ 22 : పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు మిగతా2లో..



## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చర్చించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకు నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలను కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమవుతున్నప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావద్దని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలిగేవిధంగా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

ప్రస్తుతం జనసేన పార్టీ తరఫున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## పిఠాపురం ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫోటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పాడా సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు.

## అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లు

సమావేశంలో సబ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సరైన ప్రతిపాదనలు ఉంటే త్వరితగతిన ఆమోదించాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ 8వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మార్గనిర్దేశం చేశారు. ప్రతి వారం పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. టెండర్లు, పనుల నాణ్యతపై కఠిన పర్యవేక్షణ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనిపించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారేవన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికి ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణెశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## కాళేశ్వరం కథ ముగియలేదు

తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్‌ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసీజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైం దని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ము లా వన్ రేస్ పేరు మీద చేసిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీ య వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'దూస్త్ ÷టింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వారిని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోం దని ఆరోపించారు. అందుకనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కాంగ్రెస్ సర్కార్ వెనుకాడుతోందని విమర్శించారు. ఇది రేవంత్‌రెడ్డి పరిపాలనా వైఫల్యమని, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహమని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? అని నిలదీశారు. దొంగలు, దొంగలు కలిసి తెలంగాణను దోచుకోవడంలో పోటీపడుతూ.. రాష్ట్రాన్నినా శనం చేయాలని అనుకుంటు న్నారా..? అని కిషన్‌రెడ్డి సెటైర్లు గుప్పించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్,హరీష్‌లకు ఊరట

ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు కేబినేట్‌లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

## అన్ని మతాచారాలను ఒకే గాటన కట్టలేం

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22 : మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయ పడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్సీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది. ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు. కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం లో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్- రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమర వీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.

## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుండనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్ ÷ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్÷ర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

# సంపాదకీయం

## ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి

# సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత అయుర్వేద వైద్య శిబిరం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా: భూపాలపల్లి 18 ఏప్రిల్ (విజన్ ఆంధ్ర) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో డా.విశ్వనాధ మహర్షి, ఆయుర్వేద స్పెషలిస్టు నేతృత్వంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిభిరంను ఈనెల 21 న స్థానిక కృష్ణ కాలనీ లోని సి.ఈ .ఆర్ క్లబ్ నందు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏరియా అధికార ప్రతినిధి ఎస్. శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిభిరం ఉదయం 10.00 గం.ల నుండి మధ్యాహ్నం 02:00 గం.ల వరకు నిర్వహించబడును. (చర్మవ్యాధులకు, మోకాళ్ళ నొప్పులకు, గుండె దడ, బిపి, షుగర్, థైరాయిడ్, మల బద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా, స్త్రీలకు సంబంధించిన వ్యాధుల నివారణ కోసం ఈ వైద్య శిభిరము ఉచితముగా నిర్వహించునున్నారు) పూర్తి వివరాలకు డా.విశ్వనాధ మహర్షి, అయుర్వేద స్పెషలిస్టు సెల్ నెం : 9849574706 సంప్రదించగలరని ప్రకటనలో అధికార ప్రతినిధి ఎస్. శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోకాళ్ళ నొప్పులకు, గుండె దడ, బిపి, షుగర్, థైరాయిడ్, మల బద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా, స్త్రీలకు సంబంధించిన వ్యాధుల నివారణ కోసం ఈ వైద్య శిభిరము ఉచితముగా నిర్వహించునున్నారు) పూర్తి వివరాలకు డా.విశ్వనాధ మహర్షి, అయుర్వేద స్పెషలిస్టు సెల్ నెం : 9849574706 సంప్రదించగలరని ప్రకటనలో అధికార ప్రతినిధి ఎస్. శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెతో స్తంభించిన ప్రజా రవాణా వ్యవస్థ

### ఇదే అదునుగా ప్రైవేట్ వాహనాల నిలువు దోపిడి

### ప్రత్యమ్నయ మార్గాల ద్వారా నడుస్తున్న కొన్ని బస్సులు



నిజామాబాద్ ఏప్రిల్ 22:( విజన్ ఆంధ్ర)తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె తో ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. బుధవారం అర్ధరాత్రి నుండి కార్మికుల సమ్మె మొదలైంది. అయితే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. అద్దె బస్సులతోపాటు ఆర్టీసీకి సంబంధించిన ప్రభుత్వ బస్సుల సైతం పోలీస్ బందోబస్తు మధ్య నడిపించారు. ఆర్టీసీ కార్మికులు ఉదయం నుండి డిపోల వద్ద ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ బస్సులు బయటకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడడంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళనకు దిగిన ఆర్టీసీ కార్మికులను బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు చెదరగొట్టారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఒకటి, రెండు బస్సు డిపోల నుండి బస్సులు బయటకు రాలేదు. ప్రధాన రుట్లకు మాత్రం పోలీస్ బందోబస్తు మధ్య నడిపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జర్పేందుకు సిద్ధంగా లేకపోయినప్పటికీ మరో నాలుగు నెలలలో యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరిస్తామని ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వ ప్రతిపాదనలను ఆర్టీసీ కార్మిక సంఘాలు తిరస్కరించాయి. ప్రభుత్వానికి విధించిన గడువు ముగియడంతో అర్ధరాత్రి నుండి సమ్మె సైరన్ మోగింది. అయితే ఆర్టీసీ కార్మికుల సమ్మెను అదునుగా భావించి ప్రైవేటు వాహనాలు ప్రయాణికులను నిలువు దోపిడీ చేశాయి. రెట్టింపు ధరలతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. తప్పనిసరి పరిస్థితుల్లో అధిక రేట్లు చెల్లించి ప్రయాణికులు తమ ప్రాంతాలకు వెళ్లారు.

# చేతిలో చరవాణి ఉన్ననో ఆన్సర్

### ఉద్యోగులు ఫోన్ లు లిఫ్ట్ చేయని వైనం

### ప్రతి ప్రభుత్వ శాఖలోనూ ఇదే తంతు

### ఇబ్బందులకు గురవుతున్న బాధితులు



నిజామాబాద్ ఏప్రిల్ 22:(విజన్ ఆంధ్ర) ప్రభుత్వ శాఖలలో పరిపాలన తీరు గాడి తప్పుతుంది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందించాల్సిన అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనూ బాధితుల నుండి వచ్చిన ఫోన్ లకు సమాధానం ఇవ్వడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర సేవల విభాగంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా ఉన్నతాధికారులు మాత్రం ప్రతి ఒక్కరికి ఫోన్ లిఫ్ట్ చేసి సరైన సమాధానం ఇస్తుంటే, కింది స్థాయి సిబ్బంది మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వారికి సంబంధించిన ఫోన్ లు మాత్రమే లిఫ్ట్ చేసి సమాధానం ఇస్తున్నారు. లావాదేవీలకు సంబంధించిన వ్యక్తుల ఫోన్లు మాత్రమే లిఫ్ట్ చేసి వారికి సరైన సమాధానం ఇస్తున్నారు. కొందరు ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు సైతం ఫోన్ లు లిఫ్ట్ చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని ప్రభుత్వ కార్యాలయాలకు రాలేని బాధితులు సెల్ఫోన్ ద్వారా తమ సమస్యను పరిష్కరించుకుందామంటే వారికి చేదు అనుభవమే ఎదురవుతుంది. ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధిత అధికారులు సరైన విధంగా స్పందించడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు సిఫారస్ చేసిన దరఖాస్తులకు సైతం సంబంధిత కింది స్థాయి అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. బాధితులు కార్యాలయాలకు చేరుకోలేక ఫోన్ ద్వారా తమ సమస్యకు సంబంధించిన వివరాలు సేకరించేశీదుకు ఫోన్ చేస్తే ఆయా శాఖల అధికారులు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం బాధితులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బంది ఫోన్ లకు సమాధానం ఇవ్వకపోవడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఉన్నతాధికారులు సైతం ఫోన్ లు లిఫ్ట్ చేయకపోవడం తో బాధితులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వశీ సమకూరుస్తున్న డిపార్ట్మెంట్ల ఫోన్ లను ఎక్కువగా సొంతానికి వాడుకుంటున్నారు తప్ప బాధితుల కు మాత్రం సరైన న్యాయం చేయడం లేదు. బాధితుల నుండి వచ్చిన ఫోన్లను లిఫ్ట్ చేయడానికి విసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతుంది. ఒకవేళ బాధితుని అదృష్టం బాగుండి ఫోన్ లిఫ్ట్ చేస్తే సరైన సమాధానం ఇవ్వకుండానే కట్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి అనేకమంది బాధితులు తమ సమస్య పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వస్తుంటారు. కానీ వారికి ఇక్కడైనా సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా సమస్యను వివరిద్దామంటే ఆ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం బాధితులను కలవరపెడుతుంది. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ సమస్యను పరిష్కరించి, బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా చొరవ తీసుకోవాలని, బాధితుల ఫోన్ లు లిఫ్ట్ చేయని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన ఫోన్ సౌకర్యాన్ని సొంతానికి వాడుతున్న వారి పై ప్రత్యేక దృష్టి సారించి గాడి తప్పుతున్న పరిపాలనను అదుపు చేయాలని కోరుతున్నారు.

# ఆకట్టుకున్న కథక్, పేరిణి నృత్యాలు

హైదరాబాద్ ఏప్రిల్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్): తెలంగాణ ప్రభుత్వం భాష సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా నిరవహిస్తున్న " తెలంగాణ ప్రజాకళా" 99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనోత్సవం కార్యక్రమాలలో భాగంగా పాల్కురి సోమన్న మూల వేదిక, రవీంద్ర భారతి హైదరాబాద్ లో " శ్రీ జ్ఞాన సరస్వతీ సంగీత నృత్య పాఠశాల" నిజామాబాద్ విద్యార్థులచే కథక్ నృత్యం అలాగే పేరిణి నృత్యం కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగాయి, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ నృత్య కళారూపాల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా " శ్రీ జ్ఞాన సరస్వతీ సంగీత నృత్య పాఠశాల" ప్రిన్సిపాల్, ప్రముఖ కథక్ నాట్య గురువు రవీందర్ రాజ్ శిష్య బృందంచే కథక్ నృత్యం, పేరిణి నాట్య గురువు సంతోష్ పెరుమాండ్ల శిష్య బృందంచే పేరిణి నృత్యం కార్యక్రమాలు అద్భుతంగా, నేత్రపర్వంగా ఆహుతులను అలరించాయి. నయనానందకరంగా సాగిన నృత్య కార్యక్రమాల అనంతరం గురువులను కళాకారులను సాంస్కృతిక శాఖ ప్రతినిధులు, అతిథులు ఘనంగా సత్కరించి ప్రశంశా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ప్రముఖ నటి, కో -డైరెక్టర్ పి. ఉమా రాణి, పలువురు







# ఆర్టీసీ డిపో కె పరిమితమైన బస్సులు

## సమ్మె బాటలో డ్రైవర్లు ,కాండక్టర్లు,కార్మికులు

### ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలని 32 డిమాండ్లతో సమ్మె






అసిఫాబాద్ (విజన్ ఆంధ్ర )ఏప్రిల్ 22.2026ఆసిఫాబాద్ డిపోలో ఆర్టీసీ బస్సులు పూర్తిగా నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమైంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని 32 డిమాండ్లతో కార్మికులు సమ్మెకు దిగిన నేపథ్యంలో ఈ పరిస్థితి ఏర్పడింది.డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం, ఆసిఫాబాద్ డిపోకు చెందిన మొత్తం 75 బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. సాధారణంగా రోజుకు సుమారు 30,000 కిలోమీటర్లు నడిచే బస్సులు నిలిచిపోవడంతో డిపోకు దాదాపు రూ.16 లక్షల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన తెలిపారు. డిపోలో 269 మంది రెగ్యులర్ కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు.బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 27 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని డిపో అధికారులు తెలిపారు. అయితే సరిపడా సర్వీసులు లేకపోవడంతో ఎక్కువ మంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.ప్రైవేటు వాహనాల్లో సాధారణ ఛార్జీల కంటే రెండు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆర్టీసీ ని ప్రభుత్వం విలీనం చేయాలని 32 డిమాండ్లతో సమ్మె బాట పట్టడం జరిగింది,సమ్మెలో అందరూ కార్మికులకు సంఘాల మద్దతు తెలపడంతో డిపోకు పరిమితమైన బస్సులు .సమ్మె విజయవంతం గా నడుస్తుండగా ప్రయివేట్ వ్యక్తులచే బస్సులు నడిపించాలని ప్రభుత్వం చూస్తుంది,కొత్త డ్రైవర్లకు అనుభవం లేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ప్రజల ప్రాణాలను ఇబ్బంది పెట్టిన వారు అవుతారు.ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు.తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె నడుస్తుందని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కష్టాలు

### ఆన్ లైన్ లో డబ్బులు చెల్లించిన పట్టించుకోని అధికారులు

### కలెక్టర్‌కు విన్నవించిన మాజీ ఎంపీపీ

### కలెక్టర్ ఆదేశాలు బేఖతారు




నిజామాబాద్ ఏప్రిల్22:(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశించిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి ఇసుక కోసం ఆన్ లైన్ లో డబ్బులు చెల్లించి నెల రోజులు గడుస్తున్న ఇసుక ఇవ్వకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలోని కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత తీవ్ర ఆటంకంగా మారిందని మాజీ ఎంపీపీ గుడిసే అంజమ్మ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఈనెల 7వ తేదీన ఇసుక సమస్యపై వినతిపత్రం సమర్పించారు. దీంతో స్పందించిన కలెక్టర్ మైనింగ్ ఏడిని పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించిన మైనింగ్ ఏడి పట్టించుకోవడంలేదని సమస్య ఇంకా జఠిలంగా మారిందని గుడిసె అంజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం ప్రభుత్వం నిర్దేశించిన రుసుము రూ. 8600.12/- (14 ట్రిప్పులకు గాను) ఆన్‌లైన్ ద్వారా చెల్లించి నెల రోజులు గడుస్తున్నా, ఇంతవరకు ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. భీంగల్ డిపో నుండి ఇసుక తెచ్చుకోవడానికి గ్రామస్తులకు చెందిన సొంత ట్రాక్టర్లకు అనుమతి నిరాకరిస్తున్నారని, దీనివల్ల నిర్మాణాలు నిలిచిపోయాయని వినతిపత్రంలో వివరించారు. ఇసుక కొరత కారణంగా ఇప్పటికే తెచ్చి పెట్టుకున్న కంకర, ఇనుము, ఇటుకలు రోడ్డుపైనే ఉండిపోయాయని, దీనివల్ల రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా సామాగ్రి పాడవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, కానీ క్షేత్రస్థాయిలో అధికారుల సమన్వయ లోపం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. వెంటనే స్పందించి, సొంత ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకునేలా అనుమతులు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలు సజావుగా సాగేలా చూడాలని ఆమె జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇదే విషయమై మరోసారి కలెక్టర్ ను కలిసి ఇసుక కొరత , అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి పై ఫిర్యాదు చేస్తానని అంజమ్మ స్పష్టం చేశారు.


# భారీ వర్షం వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు




అలంపూర్ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గ అయిజ మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వాన రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది,బుధవారం రోజు మండలంలోని నౌరోజీ క్యాంపు, చిన్నతండ్రపాడు, ఉప్పల గ్రామాల్లో అధికారులు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు 500 ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.వరి గింజ రాలిపోయి, కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట చేతికందకుండా పోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు తక్షణ సాయం అందజేయాలని కోరుతూ ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించినట్లు అధికారులు తెలిపారు.వర్షంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి అండగా నిలవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు

### అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో బుధవారం ఎర్రవల్లి మండలం వల్లూరు గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మైనర్ రిపైర్స్ గురించి అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. వసతి గృహంలో డ్రైనేజీ నీటిని బయటకు పంపించే మురుగు కాలువ దెబ్బతినడంతో ఇంకుడు గుంత నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ కుంగిపోవడంతో, ప్రహరీ గోడ పాక్షికంగా కూలిపోవడంతో మరమ్మత్తులు చేయిస్తామన్నారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకుల, కస్తూర్బా విద్యాలయాల్లోనూ అవసరమైన మైనర్ రిపైర్స్ చేయించేందుకు సంబంధిత వార్డెన్స్, ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందన్నారు. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సౌకర్యాలపై అక్కడి విద్యార్థులతో అధికారులు మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ రవి ప్రకాష్. ఉప సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ఎంపీడీవో అజహార్ మొహిద్దిన్, పంచాయతీరాజ్ ఏఈ భరత్ కుమార్ రెడ్డి, వార్డెన్ నరేష్, తదితరులున్నారు.

# రైతులకు అన్యాయం జరిగితే సహించం

## రైతు వేదికకు తాళాలు వేసి ఉంచడం పై స్పందించిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్



చర్ల ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): ఏజెన్సీలోని గిరిజన ఆదివాసి రైతులకు అండగా ఉంటాం రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్ ఇటీవల రైతు వేదిక వద్ద గిరిజన రైతులు పడుతున్న అవస్థలను విజన్ ఆంధ్ర పత్రిక ద్వారా తెలుసుకొని ఘటనపై తీవ్రంగా స్పందించారు, రైతుల ఆత్మగౌరవానికి భంగం కలిగినా, వారికి అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకోబోమని మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్ స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు,రైతు వేదిక వద్ద రైతులు పడిగాపులు కాసే విధానానికి చరమగీతం పాడాలని అన్నదాతలకు అండగా ఉండాల్సిన చోట వారికి అవమానం జరగడం దురదృష్టకరమని ,రైతులకు అన్యాయం చేసే వారు ఎంతటి అధికార హోదాలో ఉన్నా సరే, వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు అని ఆయన హెచ్చరించారు, చట్టపరంగా నైనా, పోరాటాల ద్వారా నైనా రైతులకు అన్యాయం జరిగితే న్యాయం జరిగే వరకు విశ్రమించబోమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతు పక్షపాతిగా రైతుల హక్కుల కోసం మార్కెట్ కమిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని, విధుల్లో నిర్లక్ష్యం వహించినా లేదా రైతులను ఇబ్బంది పెట్టినా అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కార్యాలయం మూసివేయడం, సమయపాలన పాటించకపోవడం మరియు చేతి వాటం చూపించడం వంటివి మానుకోవాలని, ఎండాకాలం కావడంతో రైతులు రైతు వేదిక కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరుగుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని కార్యాలయానికి తాళాలు వేసి ఉంచడం ఎంతవరకు సమంజసం అని , బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాడతామని వెల్లడి చేశారు, రైతు కంట కన్నీరు రావడం సమాజానికి మంచిది కాదని, మార్కెట్ కమిటీ ఎప్పుడూ రైతు వెంటే ఉంటుందని వారి సమస్యలను పరిష్కరించడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఇర్పా శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మన్ కరాకండిగా తేల్చి చెప్పారు, ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై విచారణ జరిపించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, రైతులకు భరోసా కల్పించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రైతులతో సమన్వయంగా ఉంటూ రైతు సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని అన్నారు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారు అనేది వేచి చూడాల్సి ఉంది.

## తోర్నాల బీసీ అభివృద్ధి శాఖ వారి బాలురమెట్రిక్ వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





సిద్దిపేట జిల్లా ప్రతినిధి 21 ఏప్రిల్ : సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామంలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి బాలుర పోస్టుమెట్రిక్ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియ ఈవారం సంక్షేమ వారోత్సవాలు నిర్వహణలో భాగంగా ఈ వారం మొత్తం రోజువారి కార్యక్రమాలను అత్యంత పగడ్బందీగానిర్వహించాలని హాస్టల్ వార్డెన్ ఆదేశించారు. ఈ రోజు జిల్లా నోడల్ అధికారులు అన్ని గురుకులాలు, వసతి గృహాలలో పర్యటించి విద్యార్థుల కోసం క్విజ్, డిబెట్, చిత్రలేఖనం వంటి పోటీలను టాలెంట్ ఫెస్ట్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, విద్యార్థులలోసృజనాత్మకతను, మేధస్సు ను వెలితీయడం జరిగిందని తెలిపారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటిస్తూ నాణ్యమైన ఆహార పదార్థలతో రుచికరంగా విద్యార్థులకు పెట్టాలని, మంచి క్రమశిక్షణ అలవాట్లతోవిద్యాబుద్ధులు నేర్చుకోవాలని ఒక లక్ష్యం పెట్టుకొని చదవాలని విద్యార్థులకు సూచించారు.

## ఖమ్మంలో జిల్లా కలెక్టర్ తో కలిసి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



ఖమ్మం ఏప్రిల్ 22:(విజన్ ఆంధ్ర)ఖమ్మం నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని చర్చికాంపౌండ్, ప్రకాష్ నగర్ ఓవర్ బ్రిడ్జ్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్‌ల ప్రస్తుత పరిస్థితి, మరమ్మత్తుల అవసరం, ట్రాఫిక్ సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. చర్చికాంపౌండ్ ఓవర్ బ్రిడ్జ్‌పై ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్రిడ్జ్ మధ్యభాగంలో రబ్బరు స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహనాల ప్రయాణాన్ని సాఫీగా మార్చాలని సూచించారు. అలాగే, బ్రిడ్జ్‌పై ఉన్న గుంతలు, పగుళ్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, బ్రిడ్జ్ మీద ఉన్న పూల కుండలలో మొక్కలు సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, ప్రమాదాల సూచనలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న అన్ని పనులు నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను దశలవారీగా నిర్వహించాలని సూచించారు.

## భూమిని రక్షించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉన్నది : ప్రసన్న కుమార్, కోలా రవీందర్





హైదరాబాద్ ఏప్రిల్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాధ్) : అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సంధర్భంగా నగరంలోని జీడిమెట్ల సూరారం కాలనీ లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో నిర్వహించిన కార్యక్రమంలో భూమిని రక్షించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉన్నదని,అందరికీ నీరు కావాలన్నా, నీడ కావాలన్నా నివసించాలన్నా అందుకు భూమి ఉండాలి అందుకే మాతృభూమిగా ప్రేమిస్తూ భూమాతను సంరక్షించుకున్నప్పుడే లోకమంతా సుఖంగా ఉంటుందనిఅందుకే భూమిపైన ఎలాంటి ప్లాస్టిక్ వేయకూడదని, ఎలాంటి చెత్తతో నింపకూడదని,భూమిని సారవంతంగా ఉంచినప్పుడే పంటలు కూడా బాగా పండుతాయి అని కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పర్యావరణవేత్త తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ విద్యార్థులకు వివరించారు. బుధవారంనాడు నిర్వహించిన ఈ అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ప్రముఖ సామాజిక, పర్యావరణవేత్త కోలా రవీందర్ పాల్గొని మాట్లాడుతూ, రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారాలు వాడకుండా సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం చేస్తూ పంటలను పండించాలని తద్వారా భూమాతను కాపాడుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థి తమ ఇంటిలో ప్లాస్టికవర్ వాడకుండా, మార్కెట్ కి వెళ్ళినప్పుడు ప్లాస్టికేతర చేతి సంచులు తీసుకునివెళ్లే విధంగా తల్లిదండ్రులను మార్చాలని విద్యార్థులకు హితబోధ చేశారు. అనంతరం కోలా రవీందర్, భూమాతను పరిరక్షిం చుకోవాలంటే ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని, ప్లకార్డుల ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, భూమాతను ప్రతి ఒక్కరం కాపాడుకోవాలని జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ అంతర్జాతీయ భూమి దినోత్సవం కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, పుణ్యవతి, రవికుమార్, జావిద్, లక్ష్మణ్, హనుమంతరావు, వెంకట్రావు స్కూల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్తుపదార్థాల పై అవగాహన కల్పించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్ జి



ములుగు ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): బుధవారం: జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ సి. హెచ్. మహేందర్ జి నిర్వహించి మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యువత, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా పోలీస్, ఎక్సైజ్ మరియు విద్యాశాఖలు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలు, అక్రమ రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ విక్రయాలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, గ్రామ, మండల స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ములుగు సామాజిక ఆసుపత్రి లో ప్రత్యేకంగా డి అడిక్షన్ కేంద్రం అందుబాటులో ఉందని మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రత్యేక వైద్య నిపుణులతో సైకాలజిస్ట్ లతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సిద్ధార్థ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డీఏఓ, డీసీఓ, కలెక్టరేట్ పర్యవేక్షకుడు మహేష్ బాబు,ఎక్సైజ్ శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో టోకెన్ విధానాన్ని సరిగా అమలు చేయాలి

## బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## తాగునీటి నాణ్యతపై పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ఏప్రిల్22(విజన్ ఆంధ్ర): జనగామ మండలంలోని చౌడారం గ్రామ పంచాయతీ పరిధిలో గల (టీజీఎంఎస్ మరియు జూనియర్ కళాశాల) పీఎం శ్రీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్, ఐటీ ల్యాబ్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ ల్యాబ్, లైబ్రరీలను పరిశీలించి, ఏ ఏ పుస్తకాలు ఉన్నాయి అని లైబ్రేరియన్ ని అడిగి తెలుసుకున్నారు. అలాగే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఖచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. బడి బాట కార్యక్రమాన్ని సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకోసారి తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. శుభ్రమైన నీరు.. ఆరోగ్యానికి ఆధారం అని తెలిపారు. అనంతరం జనగామ మండలంలోని చౌడారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో టోకెన్ల వారీగా జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి, కేంద్ర నిర్వాహకులను, ఏఈఓను కలెక్టర్ అభినందించారు. ఎండ దెబ్బ తగలకుండా రైతులు, అధికారులు, ఇతర సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ధ్యానం కాంటా వేసే విధానాన్ని పరిశీలించి, ఎప్పటికప్పుడు దాన్యం బస్తాల తూకం పూర్తిచేసి, సంబంధిత మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. తదనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్‌ను కలెక్టర్ సందర్శించి పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే బస్ స్టాండ్‌లో తాగునీటి సదుపాయాలను పరిశీలించి, అక్కడ అందిస్తున్న తాగునీటి నాణ్యతను స్వయంగా పరీక్షించేందుకు నీటిని తాగి, పరిశుభ్రత, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రయాణికులు వేచి ఉండే సమయం తగ్గించేలా టికెట్లు వేగంగా జారీ చేయాలని, ఆలస్యం లేకుండా బస్సులు నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని డ్రైవర్లు, కండక్టర్లకు సూచనలు ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి ఆర్టీసీ డిపో ముందు కార్మికుల ధర్నా

## ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చెయ్యాలి

## 2021 వేతన సవరణ 30% ఫిట్మెంట్ తో అమలు చేయాలి.

## ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్



భూపాలపల్లి (విజన్ ఆంధ్ర ) ఏప్రిల్ 22: భూపాలపల్లి డిపో ముందు ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ప్రతినెల 350 కోట్లు కోత విధించకుండా చెల్లించాలి (ప్రభుత్వం ఇవ్వవలసిన పాత బకాయిలు సుమారు 2 వేల 500 కోట్లు వెంటనే విడుదల చేయాలి). ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి / బెడ్ విన్నర్ స్కీంలో పనిచేస్తున్నవారందరిని రెగ్యులర్ చేయాలి, ఈ పోస్టులను పర్మినెంట్ ఉద్యోగాల కింద భర్తీ చేయాలి. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలి/ గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించాలి. అన్ని కేటగిరీలలో పని చేస్తున్న ఉద్యోగులపై అధిక పనిభారాలు తగ్గించాలి. ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వమే కొని ఆర్టీసికి ఇవ్వాలి / ఆర్టీసి స్థలాలను ఈవీ బస్సులకు ఇవ్వరాదు. మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి / అన్ని కేటగిరీలలోని ఖాళీలను భర్తీ చేయాలి. రిటైరైన ఉద్యోగుల బకాయిలను అన్నిటినీ చెల్లించాలి. కార్మిక ఐక్యత వర్ధిల్లాలి! హయ్యర్ పెన్షన్ రిజెక్ట్ అయిన వారికి హయ్యర్ పెన్షన్ పొందేందుకు మరొక అవకాశం ఇవ్వాలి, డిమాండ్ నోటీసు రానివారికందరికీ ఈపిఎఫ్ నుండి డిమాండ్ నోటీసులు ఇప్పించాలి. అనంతరం ఆర్టీసీ కార్మికుల ధర్నాకు టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై ధర్నాకు సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి బిల్లును గవర్నర్ వద్ద పంపించాడు కానీ అంతలోనే అసెంబ్లీ ఎలక్షన్లు రావడం జరిగింది. మా ప్రభుత్వం పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం జరిగింది సమస్య మొదలైంది లేకుంటే ఆనాడే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించబడేవి అని వారు అన్నారు కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని వారు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికుల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలోఆర్టీసీ జేఏస్ చైర్మన్ బుర్రి తిరుపతి, వైస్ చైర్మన్ వద్దేపల్లి రవి కన్వీనర్ బండి శ్రీనివాస్ కో కన్వీనర్ డి రాజయ్య కోశాధికారి సతీష్ ప్రచార కార్యదర్శి కే ప్రసాద్ సునీత సుమలత సేపు అడ్వైజర్ రవీందర్ పాల్గొన్నారు.

# 'తెలంగాణ ప్రజల గొంతురాజకీయ పోరాట సభ' పోస్టర్ ఆవిష్కరణ



మల్కాజిగిరి, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఈ నెల 25 వ తేదీన నిర్వహించబోయే "తెలంగాణ ప్రజల గొంతు "రాజకీయ పోరాట సభ" పోస్టర్‌ను బుధవారం మౌలాలిలో ఆ పార్టీ నాయ కులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ... కులమత తేడాలు లేకుండా ముందుగా కట్ట మైసమ్మ గుడిలో రేణుక ఎల్లమ్మకు పూజలు చేశామని చెప్పారు. మౌలాలి దర్గా, బీతల చర్చిలో కూడా ప్రార్థనలు చేసి ఐక్యతను చాటామని తెలిపారు. ఈ నెల 25న ఉదయం 8 గంటలకు ముని రాబాద్‌లోని అద్వైయ కన్వెన్షన్ వద్ద జరగనున్న ఈ మహాసభకు మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. మద్దాలి సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు రాముడి వెంకట్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు లలిత యాదవ్, ఉప్పల్ ఇంచార్జ్ వేముల భవాని, సీనియర్ నాయకులు కుసుమ రజిత, నవీన్ యాదవ్, శ్రావణ ముదిరాజ్, విజయలక్ష్మి ముదిరాజ్, రామా, స్టూడెంట్ లీడర్ సాయి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మం,ఏప్రిల్ 22( విజన్ ఆంధ్ర ): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీలో బుధవారం చింతపల్లి నుంచి ముత్తగూడెం వరకు 6 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూలి నేడు శంకుస్థాపన చేసిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను రాబోయే వర్షాకాలానికి ముందే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో, నిర్దిష్ట కాలపట్టికలో పూర్తి చేయాలని, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా పర్యవేక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ముత్తగూడెంకు గత కాలంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లు, లింకు రోడ్ల అభివృద్ధికి కలిపి రూ. 16 కోట్ల 70 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా నిర్లక్ష్యం ఉండదని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 2 లక్షల వరకు రుణమాఫీ, రైతులకు ప్రతి ఎకరానికి ప్రతి పంటకు రూ. 6 వేల రైతు భరోసా, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి పథకాలను కొనసాగిస్తూ, అదనంగా పేదలకు మరింత భరోసా కలిగించే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా ఆగకుండా కొనసాగుతుందని ప్రభుత్వం మంజూరు చేసిన 6 కోట్ల 50 లక్షలతో నిర్మించే ఈ రోడ్డు పనులు నాణ్యతతో, సకాలంలో పూర్తి అయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఈ రహదారి కనీసం 20 సంవత్సరాలకు పైగా ప్రజలకు ఉపయోగ పడేలా నిర్మించాలని సూచించారు.

# సొంత తమ్ముడిపై అన్న కొడుకులు కట్టలతో దాడి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22: భూతగాదాల కారణంగా సొంత తమ్ముడిని అన్నలు మరియు అతని కొడుకులు కలిసి దారుణంగా కట్టెలతో దాడి చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా నారాయణ రావు పేట మండలం శేఖర్ రావ్ పేట లో చోటు చేసుకుంది గత నాలుగు సంవత్సరాలుగా భూ వివాదాలుకొనసాగుతుండగా ఈ వివాదాలకు చెక్ పెట్టేందుకు ఎవరో ఒకరు భూమి అమ్ముకుని అక్కడినుండి తప్పుకోవాల్సిందిగా పెద్దలు నిర్ణయించగా. ముగ్గురు సోదరులలో చిన్నవాడు అయిన నాంపల్లి భిక్షపతి తండ్రి కిష్టయ్య తన అన్న అయిన నాంపల్లి నర్సయ్య వద్దగల మూడు ఎకరాల భూమిని కోనేందుకు అంగీకారం తెలిపాడు. అందుకు ఒక్క ఎకరాకు 25 లక్షల రూపాయలకు బేరం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్ గా 18 లక్షల 50 వేల రూపాయలు కూడా చెల్లించారు. అయినప్పటికీ రిజిస్ట్రేషన్కు సహకరించకుండా ఇబ్బందులకు గురి చేస్తూ వాగ్వాదానికి దిగుతూ వస్తున్నారు. రిజిస్ట్రేషన్ కు సహకరించకుండా ఇటు డబ్బులు తిరిగి ఇవ్వకపోగా తేదీ 12-04-2026 రోజున ఉదయం 7 గంటల సమయంలో వ్యవసాయ పనుల్లో ఉండగా నాంపల్లి నర్సయ్య మరియు అతని కుమారులు నాంపల్లి రాజు, రమేష్, ప్రశాంత్ లు నాంపల్లి భిక్షపతి మరియు అతని కుమారునిపై కర్రలతో దారుణంగా దాడి చేసారు. దేంతో కేసు నమోదు చేసుకున్న చిన్నకోడూరు పోలీస్ అధికారులు నిందుతులను రిమాండ్ కు తరలించారు

# వేసవి వేళ రామ లిసహాయంలి

## 44 గ్రామాల్లో తాగునీటి కష్టాలకు ఎంపీ రఘురాం రెడ్డి చెక్

## రూ.35 లక్షల నిధులతో ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు

## వారం రోజుల్లోనే పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు



ఖమ్మం, ఏప్రిల్ 22( విజన్ ఆంధ్ర )వేసవిలో భానుడు భగభగలాడుతుండటంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఖమ్మం పార్లమెంట్ నభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల (ఎంపీలాడ్స్) నుంచి రూ. 35 లక్షలు మంజూరు చేస్తూ తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు.ఎదప్పిక తీర్చే 'ఎంపీ లాడ్స్':జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు నియోజకవర్గాలోని 44 గ్రామాల్లో రూ. 35,20,000 నిధులతో కొత్తగా చేతిపంపులను ఏర్పాటు చేయించనున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయగా.. ఇప్పటికే కొన్ని ప్రారంభమయ్యాయి. దీనివల్ల వృద్ధులు, మహిళలకు దూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకునే కష్టాలు తప్పనున్నాయి. లివారం రోజుల్లోనే పనులు పూర్తి కావాలినిధుల అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను పట్టాలెక్కించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఎ తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే నిధులు కేటాయించినందుకు స్థానిక సర్పంచ్ లు, ప్రజలు ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# మావో ఆలోచనా విధానమే దేశ విముక్తి సిద్ధాంతం : కోలా లక్ష్మీనారాయణ



ఖమ్మం , ఏప్రిల్ 22 ( విజన్ ఆంధ్ర ): మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు.లి భూమి, భక్తి, ఈదేశ విముక్తి కోసం 1969 లో రివిజనిస్టు నయా రివిజనిస్టులతో తగదింపులు చేసుకొని సిపిఐ(ఎంఎల్) ఆవిర్భవించిందన్నారు. ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు సిపిఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించామన్నారు. లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు, గిరిజనులకు పంచిపెట్టామన్నారు. అనేక గ్రామాలు నిర్మించామన్నారు. ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించామన్నారు. ప్రస్తుతం భారతదేశంలో మతోన్మాద ఫాసిస్టు భావజాలంతో బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ పని చేస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాట్లాడే వాళ్ళపై నిర్బంధం ప్రయోగించి అణచివేస్తున్నారన్నారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనారిటీల పైన రోజురోజుకు దాడులు కొనసాగిస్తున్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, ధనిక వర్గాలకు, ప్రైవేటు శక్తులకు దోచిపెట్టే నిర్ణయాలు చేస్తున్నారన్నారు. దేశాన్ని తాకట్టు పెట్టి దేశ సంపదను లూటీ చేస్తున్నారన్నారు. మరోపక్క సామ్రాజ్యవాదం బుసలు కొడుతూ ప్రపంచ యుద్ధాలను ప్రేరేపిస్తున్నారన్నారు. మరోపక్క రాష్ట్రంలో దొంగలు పడి ప్రజల సంపదను యావత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. ఎన్నికల నాడు అనేక ఉచిత వాగ్దానాలు, హామీలు ఇచ్చి అవి నెరవేర్చలేని స్థితిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికార యంత్రాంగం ఉందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడమే పనిగా పెట్టుకుని దోపిడీని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దేశంలో, రాష్ట్రంలో దళారీ ప్రభుత్వాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ దళారీ ప్రభుత్వాలను కూల్చివేయడానికి విప్లవకారులంతా ఐక్యం కావాలన్నారు. దేశంలో వర్గాలు లేని సమ సమాజాన్ని స్థాపించాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గమని అన్నారు. దేశంలో ప్రజలందరూ స్వేచ్ఛా, సమానత్వంతో జీవించాలంటే మార్క్సిజం-లెనినిజం- మావో ఆలోచనా విధానంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. బూర్జువాలకు, భూస్వాములకు, పెత్తందారులకు, పెట్టుబడుదారులకు, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే దళారీ నిరంకుశ ప్రభుత్వాలను కూకటి వేళ్ళతో కూల్చివేయాలన్నారు. నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ మండల నాయకులు కోలా అప్పారావు, ఆంగోతు లాలు సిరిపురపు సూర్యం, వార్డు నెంబరు కోలా దర్గయ్య, షేక్ ఖాసిం, కోలా వెంకటయ్య, కోలా జగదీష్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బంద్ సక్సెస్ ప్రయాణికులకు ఇబ్బంది

సిద్దిపేట జిల్లా కేంద్రంలో బంద్ సంపూర్ణంగా నిర్వహించి ఆర్టీసీ కార్మికులు బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. గత 45 రోజుల క్రితం ఇచ్చిన ఇప్పటివరకు ప్రభుత్వం ఇలాంటి స్పందన లేకపోవడంతో మీమందరం సమ్మె దిగవలసి వచ్చిందని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. రోడ్డు రవాణా వ్యవస్థను ప్రభుత్వ వ్యవస్థగా పరిగణించి మమ్మల్ని మా కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు పిల్లల్ని ఇల్లును వదిలి బస్సు వెంట ప్రజలకు సేవలు చేస్తున్న మమ్మల్ని కనీసం మేము మా కుటుంబాలు బతకడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని వేతనాల విషయంలో కూడా సవరించాలని వారు అన్నారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టినప్పటి నుండి బస్సులలో మహారధి పెరిగిందని అయినా దీనిని సైతం మేము భరిస్తూ సేవలు చేస్తున్నామని. ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి విడినాడు మా యొక్క సాధకబాదులను గుర్తించి మాకు న్యాయం చేయాలని వారు కూడా సిద్దిపేట జిల్లాతో పాటుగా మెదక్ సంగారెడ్డి అన్ని డిపోలో ఎదుట కార్మికులందరూ బయట నుంచి నినాదాలు చేయడం కనిపించింది డిపోల ముందు పోలీస్ భారీ బందోబస్తుతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కొన్ని ప్రైవేటు బస్సులు మాత్రం తూతూ మంత్రంగా రోడ్లమీద తిరగడం కనిపించింది



కథ బిఆర్ఎస్ ప్రభుత్వంలో మమ్మల్ని మోసం చేశారు కనీసం ఎప్పుడైనా మాకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు

సమ్మె విరమించండి చేరండి ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ పరిరక్షణ, ప్రజాశ్రేయస్సు కోసం సమ్మె విరమించాలని కోరారు. సమస్యకు సమ్మె పరిష్కారం కాదన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికి కమిటీ వేసినట్లు తెలిపారు. నాలుగు వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించామన్నారు. 32 అంశాల్లో 29 వెంటనే పరిష్కారంచేయదగినవని.. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికల అంశాలు పెండింగ్‌లోఉన్నాయన్నారు. ఈ విషయాలపై సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామన్నారు.

# ఘనంగా లెనిన్ 156వ జయంతి

ఖమ్మం, ఏప్రిల్ 22 ( విజన్ ఆంధ్ర ): బుధవారం ఖమ్మం సుందరయ్య భవనంలో ప్రథమ సోషలిస్టు వ్యవస్థ స్థాపకుడు అమరజీవి వి.ఐ. లెనిన్ 156వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, అధ్యక్షతన జరిగిన లెనిన్ జయంతి సభలో మాట్లాడుతూ ప్రపంచంలో ఒక మనిషిని, వేరొక మనిషి, ఒక జాతిని మరొక జాతి, ఒక దేశాన్ని మరో దేశం దోపిడీ చేయనటువంటి ఒక వ్యవస్థను రూపొందించిన మహనీయుడు లెనిన్ అన్నారు. మార్క్స్, ఏంగెల్స్ రూపొందించినటువంటి ప్రణాళికను ఆర్థిక తత్వశాస్త్రాన్ని ఆచరణలో అమలుపరచిన గొప్ప విప్లవకారుడు లెనిన్ అని అన్నారు. అప్పటి వరకు లేనటువంటి ఒక వ్యవస్థను రూపుదిద్దటమే కాకుండా ఆ వ్యవస్థ ఇతర దేశాలలో కూడా రూపుదిద్దుకొనేందుకు పాటుపడిన వ్యక్తి అని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న సామ్రాజ్యవాద దురహంకార విధానాలకు మద్దతు ఇస్తూ భారత ప్రధాని మోడీ ఆయనను సమర్థిస్తూ వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. మన దేశానికి వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాన్స్ తో మోడీ దేశానికి నష్టకరమైన రక్షణ ఇంధన మరియు స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో వ్యవసాయం పాడి పరిశ్రమ తదితర రంగాలలో అవమానకరమైన ఒప్పందాలు చేసుకునే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థుల జీవితాలతో దురహంకార ట్రంప్ చెలగాటమాడుతుంటే ఇక్కడ మోడీ జె.డి వ్యాన్స్ పిల్లలతో ఆటలాడుకుంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. దేశంలోని ప్రభుత్వ



రంగ సంస్థలను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాడని అన్నారు. అలాగే మధ్య భాగంలో ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసి జాతి ప్రజలపై మారణకాండ కొనసాగిస్తున్నాడని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా దళిత ఆదివాసీ బహుజనులపై హిందూ మతోన్మాద దాడులు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మనువాద విధానాలు అనుసరిస్తూ రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులను హరించి వేస్తున్నదని విమర్శించారు. ఈ సమయంలో విప్లవ పార్టీల ఐక్యత ఆవశ్యకత ఏర్పడిరదని ఆయన తెలియజేశారు. రష్యా సోషలిస్టు నిర్మాత కామ్రేడ్ లెనిన్ చేసిన పోరాటాలను విజయాలను అధ్యయనం చేయాలని మనదేశంలో కూడా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం జరిగే పోరాటాలలో పాల్గొనాలని, కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా, వివిధ వర్గాల ప్రజలు చేస్తున్న పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం బలవంత భూసేకరణ అన్యాయం



భూపాలపల్లి విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 : నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం మొగుళ్ల పల్లి మండల కేంద్రంలోని రైతులను అక్రమంగా అరెస్టు చేసి బలవంతంగా తమ భూమిలోని చొరబడి తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ప్రస్తుతమున్నటువంటి మార్కెట్ విలువ ప్రకారము పరిహారం చెల్లించాలని కానీ తమకు తక్కువ పరిహారము చెల్లించడం అన్యాయమని మొగులపల్లి మండల కేంద్రానికి సమీపంలో ఉన్నటువంటి నబాబుపేట గ్రామంలో 27 లక్షల 50 వేల రూపాయలు చెల్లించి మొగుళ్ళపల్లి మండల కేంద్రానికి కేవలం 22 లక్షల 50 వేలు చెల్లించడం ఏంటని అంతేకాకుండా మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం గ్రామానికి నోటిఫికేషన్ తర్వాత ఆ గ్రామానికి 21,50,000 నిర్ణయించి మండల కేంద్రానికి 22 లక్షల 50 వేలు నిర్ణయించి రైతులు ప్రస్తుతం ఉన్నటువంటి మార్కెట్ విలువ ప్రకారము ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎన్నో ధర్నాలు రాస్తారోకోలు నిరసనలు చేపట్టిన తర్వాత రంగపురం గ్రామానికి నోటిఫికేషన్ తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటిని పరిగణలోకి తీసుకొని 29 లక్షల 60000 వేయిలు మండల కేంద్రానికి తక్కువ ధర నిర్ణయించడం ఎంతవరకు సబబని వెంటనే మండల కేంద్రానికి మిగతా గ్రామాల కంటే ఎక్కువ ధర చెల్లించాలని లేనిచో ఎంతటి త్యాగానికైనా సిద్ధమని అరెస్టు చేసి ఎన్ని రోజులు మమ్ములను ఆపగలరని మా వారసత్వంగా వస్తున్నటువంటి మా తాత ముత్తాతల నుండి మా కుటుంబాలకు జీవనాధారముగా నుండి భూమిని కోల్పోవడం చాలా అన్యాయమని మా కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని కలెక్టర్ గారు ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు పోలీసులతో బలవంతపు భూసేకరణ చేపట్టినటువంటి తాసిల్దారు గారు మొగళ్లపల్లి మండల కేంద్రానికి ఎందుకు వివక్షత అని ఆ మండల కేంద్రానికి కూడా సరైన ధర నిర్ణయించి న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతులు బండారి రవీందర్ అరికాంతపు కృష్ణారెడ్డి కొల్లూరు మనోహర్ స్వప్న అడ్డూరి రాజేందర్ గుండా బిక్షపతి గుర్రపు సునంద రెడ్డి ముడుపు మల్లారెడ్డిమోరే పద్మ మోరే అనూష చిలకామారి బొంద్యాలు గుర్రపు తిరుపతిరెడ్డి బోయిన కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన డి.ఎల్.ఎడ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం



కొత్తగూడెం బ్యూరో, భద్రాచలం ఏప్రిల్ 23(విజన్ ఆంధ్ర)2026-28 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థుల సంక్షేమార్థం భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన డి.ఎల్.ఎడ్ కళాశాలలో తెలుగు మీడియం రెగ్యులర్ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఈ కోర్సులో మొత్తం 50 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తెలంగాణకు చెందిన ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు మే/జూన్ 2026 లేదా అంతకు ముందు ఇంటర్మీడియట్ పరీక్షలో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్మీడియట్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ నియమాల ప్రకారం మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ అమలులో ఉంటుందని తెలిపారు.ప్రాస్పెక్టస్ మరియు దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయని, ఏటూరునాగారం, ఉట్నూర్, మన్ననూరు ఐటిడిఏ కార్యాలయాలు మరియు భద్రాచలం గిరిజన డి.ఎల్.ఎడ్ కళాశాలలో పొందవచ్చని పేర్కొన్నారు. పోస్ట్ ద్వారా పొందదలచిన అభ్యర్థులు తమ స్వీయ చిరునామా గల కవర్ (రూ.10 స్టాంపుతో)ను ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలం చిరునామాకు పంపించాలని సూచించారు. దరఖాస్తును పూర్తిగా భర్తీ చేసి వచ్చే నెల 11వ తేదీలోగా సమర్పించాలని, అసంపూర్ణ దరఖాస్తులు తిరస్కరించబడతాయని హెచ్చరించారు. మరిన్ని వివరాలకు 9959575539, 8639084543, 8309972776 నంబర్లను సంప్రదించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ కోరారు.

# వర్షాకాలానికే గోదావరి జలాలు సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులు వేగవంతం చేయాలి

## మంత్రి తుమ్మల

కొత్తగూడెం బ్యూరో, సత్తుపల్లి ఏప్రిల్ 23 (విజన్ ఆంధ్ర)సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి, రాబోయే వర్షాకాలానికే గోదావరి జలాలు ఆయకట్టుకు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు.బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యతలకుంటలో ఉమ్మడి జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సమావేశానికి అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి తదితరులు హాజరయ్యారు.సమావేశానికి ముందు అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యతలకుంట వరకు కొనసాగుతున్న కాలువ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్‌లు, కాలువ తవ్వకాల పురోగతిపై అధికారులను ఆరా తీసి, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సుమారు 43



కిలోమీటర్ల పొడవు గల ఈ ట్రంక్ కాలువ ద్వారా 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టింది. రూ.700 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ పనుల్లో ఇప్పటివరకు రూ.600 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు.యతలకుంట టర్మినల్‌లో మిగిలిన 30 మీటర్ల పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని, అలాగే స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు పెండింగ్‌లో ఉన్న పనులను గోదావరి వరదల ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. మే నెలాఖరులోగా అన్ని పెండింగ్ పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు.భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరయ్యాయని మంత్రి వెల్లడించారు. భూ వివాదాలు లేదా కోర్టు కేసుల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యం అయితే వెంటనే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిన్నచిన్న సమస్యల కారణంగా ప్రాజెక్ట్ పనులు నిలిచిపోవడం అనర్థమని హెచ్చరించారు.యకట్టు ఖమ్మం జిల్లాలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతున్న నేపథ్యంలో ఉభయ జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. అటవీ, పోలీస్ శాఖల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు.నాలుగో పంప్ హౌస్ పనులు పూర్తి అయితే వచ్చే ఏడాదిలో అశ్వరావుపేట, దమ్మపేట ప్రాంతాలకు గోదావరి జలాలు అందించవచ్చని మంత్రి తెలిపారు. మొత్తం 110 కిలోమీటర్ల కాలువ వ్యవస్థ పూర్తయి, మూడు పంప్ హౌస్‌ల ద్వారా ఎనిమిది నియోజకవర్గాలకు నీటి సరఫరా జరిగే అవకాశముందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఉభయ జిల్లాలు సస్యశ్యామలంగా మారి, రైతులకు స్థిరమైన నీటి వనరులు అందుతాయని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్, పోలీస్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా విజన్ ఆంధ్ర ఏప్రిల్ 21 : టీజీఎస్ఆర్టీసీ జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి డిపో ముందు జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పాల్గొని కార్మికులకు పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డిపో ముందు కార్మికులతో కలిసి కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ రవి పటేల్ గారు ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు కీలక డిమాండ్లు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణలో 30% ఫిట్మెంట్ అమలు చేయాలని, అలాగే 2025 వేతన సవరణను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే ప్రతి నెల ప్రభుత్వం ఆర్టీసీకి ₹400 కోట్లు ఆర్థిక సహాయం అందించాలని, ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ట్రేడ్ యూనియన్ గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలని, కార్మికులపై ఉన్న పనిభారం తగ్గించాలని ఆయన పేర్కొన్నారు.ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి వెంటనే ఆర్టీసీకి అందించాలని, అద్దె బస్సు డ్రైవర్లను ఆర్టీసీలో విలీనం చేయాలని, అధిక సంఖ్యలో బస్సులను పునరుద్ధరించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు ఇచ్చిన సమ్మె నోటీసులో పేర్కొన్న అన్ని న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని రవి పటేల్ గారు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని, కార్మికుల న్యాయపరమైన పోరాటంలో తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రవి పటేల్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, జిల్లా కార్మిక సంఘం నాయకులు, జిల్లా ఉపాధ్యక్షుడు అనంతల సంపత్, జిల్లా కోశాధికారి జిలకర శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు వైద్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


# అక్రమ గుడాంబా తయారీపై పోలీస్ ల దాడులు



భూపాలపల్లి జిల్లా విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 : పలిమెల మండలం సర్వాయిపేట గ్రామంలో అక్రమ గుడుంబా తయారీపై పోలీసుల ప్రత్యేక దాడులుజిల్లాలో అక్రమ గుడుంబా తయారీని అరికట్టేందుకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్, గారి ఆదేశాల మేరకు పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోనీ సర్వాయిపేట గ్రామంలో ప్రత్యేక దాడులు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా సర్వాయిపేట గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు.దాడులలో భాగంగా సుమారు 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, గుడుంబా తయారీకి వినియోగిస్తున్న సుమారు 350 లీటర్ల బెల్లం పానకంను గుర్తించి అదే ప్రదేశంలో ధ్వంసం చేయడం జరిగింది.ఈ ఘటనకు సంబంధించి నిందితులపై చట్టపరమైన కేసులు నమోదు చేయబడినవి.నిందితుల వివరాలు:1. కుమ్మరి ప్రవీణ్ నా/శీ అంకయ్య, 33 సంవత్సరాలు, సర్వాయిపేట గ్రామం2. బౌతు రామయ్య నా/శీ బక్కయ్య, 49 సంవత్సరాలు, సర్వాయిపేట గ్రామంజిల్లాలో అక్రమ గుడుంబా తయారీ మరియు విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేయడమైనది.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిసిఓ

నిర్మల్ జిల్లా, ఏప్రిల్ 22,(విజన్ ఆంధ్రా); జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను , నూతన జిల్లా కోపరేటివ్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్రీనివాసరావు, కలెక్టరేట్లోని తన చాంబర్లో బుధవారం సాయంత్రం పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారుఈ సందర్భంగా కలెక్టర్ డిసిఓ కు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.



# పేదల గడప వద్దకే సంక్షేమ పథకాలు మంత్రి పొంగులేటి

ఖమ్మం ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఖమ్మం నగరం 1వ, 59వ, 60వ డివిజన్‌లకు చెందిన (27) మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల గడప వద్దకే పథకాలను చేరవేస్తున్నామని అన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. అదనంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 2 లక్షల రూపాయలు రుణమాఫీ, రైతులకు ప్రతి ఎకరానికి ప్రతి పంటకు 6 వేల రైతు భరోసా, సన్న బియ్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయలు బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.విద్య, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆపద సమయంలో పేదలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్నామని, పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు 20 నుంచి 25 ఎకరాల్లో 2500 మంది విద్యార్థులు చదివే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు చెప్పారు.ప్రస్తుతం ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నాయని, ఈ ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని ఆపిందో చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇండ్ల పేరుతో పేదలను మోసం చేసిందని, అయితే తమ ప్రభుత్వం తొలి దశలోనే సుమారు 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో రెండో దశ ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు అందజేస్తామని, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి ఇల్లు కల్పిస్తామని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ చేయలేదని, ప్రజలు ప్రతిపక్షాల నిరాధార ఆరోపణలను గమనిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలకు తగిన సమాధానం ఇచ్చి తమ ప్రభుత్వానికి మద్దతు తెలిపారని అన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని, ప్రజలు ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి కోరారు.

# ఆరుగురు ఐపిఎస్‌లకు డిజి హోదా

హైదరాబాద్,ఏప్రిల్ 22: తెలంగాణలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. 1995 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు,1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్‌కుమార్, సజ్జనార్ కు డైరెక్టర్ జనరల్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

# మొదటి రోజు ఆర్టీసీ సమ్మె సక్సెస్‌కదలని ప్రగతి రథచక్రాలుప్రజలకు తప్పని ఇబ్బందులు

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

### వెంటనే సమ్మె విరమించి రండి

### ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

హైదారబాద్,ఏప్రిల్22:ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చర్చించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు.

## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కార్మికుల ఆందోళన..

## సమ్మెకు మద్దతు తెలిపిన మాజీమంత్రి జోగు రామన్న..



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర) తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ తో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన సమ్మె మొదటి రోజు సక్సెస్ అయింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆర్టీసీ బస్సులు ఆయా డిపోలకు పరిమితమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 345 ఆర్టిసి కార్పొరేషన్ బస్సులు ఉండగా, 295 అద్దె బస్సులు ఉన్నాయి. అయితే తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ పలుమార్లు ప్రభుత్వానికి వినతులు సమర్పించిన, చర్చలు జరిపిన అవి సఫలం కాకపోవడంతో ఎట్టకేలకు ఈనెల 22న బుధవారం సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. అనుకున్నట్లుగానే ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేపట్టడంతో ప్రజా రవాణా ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్ లలో ప్రయాణికులు కిక్కిరిసిపోగా, మరికొంతమంది తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు. ఇది ఇలా ఉంటే ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా మాజీ మంత్రి జోగు రామన్న, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పలువురు నాయకులు కార్యకర్తలతో కలిసి బస్టాండ్ ఎదుట సమ్మె చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు టి ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.గత ఎన్నికల్లో ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆర్టీసీ ఉద్యోగులు ఆరోపిస్తూ జేఏసీగా ఏర్పడి సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోలో బస్సులను నిలిపివేసి, బస్టాండ్ ఎదుట పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనకు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మాజీ మంత్రి జోగు రామన్న ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి ధర్నాలో పాల్గొని వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సజ్జనర్ కమిటీ కూడా కేవలం నామమాత్రంగా పనిచేస్తోందన్నారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి, ఉద్యోగులకు రావాల్సిన ఏరియర్స్, పే స్కేల్ సమస్యలు పరిష్కరించలేదని, యూనియన్ల పునరుద్ధరణ, కారుణ్య నియామకాల ఉద్యోగులను రెగ్యులర్ చేయడం వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు వారి పోరాటానికి టీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతుగా ఉంటుందని జోగు రామన్న స్పష్టం చేశారు. తాత్కాలిక పద్ధతిన డ్రైవర్ కండక్టర్ల నియమకానికి దరఖాస్తుల ఆహ్వానం..రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు సమ్మెలోకి దిగడంతో ప్రజా రవాణా స్తంభించిపోయి ప్రయాణికులు, ప్రజలకు తీవ్ర ఇక్కడ ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీసీతో పాటు రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో తాత్కాలిక పద్ధతిన డ్రైవర్, కండక్టర్ ఉద్యోగులను నియమించే ప్రక్రియను చేపట్టింది .ఇందుకుగాను అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించేందుకు ప్రకటన విడుదల చేసింది. రోజువారీగా కండక్టర్ కు 800లు, రూపాయలు డ్రైవర్ కు 1000ల చొప్పున చెల్లించనుంది. అయితే ఈ ఈ నియామకాలు సమ్మె కాలానికి మాత్రమే వర్తిస్తాయని అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ డి.విజయ భాను తెలియజేశారు.

# ఆదిలాబాదు అర్బన్, గ్రామీణ కేజీబీవీలలో ఖగోల, అంతరిక్షప్రయోగశాలను ప్రారంభించిన

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర) విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని బంగారిగూడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యు.ఎస్.పి. ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సామాజిక బాధ్యత సిఎస్ఆర్ నిధులతో, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, నవార్స్ ఎడ్యుటెక్ సహకారంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'ఖగోళ, అంతరిక్ష ప్రయోగశాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈ అంతరిక్ష ప్రయోగశాల విద్యార్థులలో జిజ్ఞాసను పెంచి, భవిష్యత్తులో వారు అంతరిక్ష శాస్త్రవేత్తలుగా లేదా స్పేస్ స్టార్టప్‌లు ప్రారంభించే స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు తిరిగి వచ్చినప్పుడు ఈ ల్యాబ్‌లోని అత్యాధునిక పరికరాలను, ప్రాచీన, ఆధునిక ఖగోళ శాస్త్ర నమూనాలను ఉపయోగించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నేర్చుకునే విధానంలో మార్పు రావాలని, కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాకుండా 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్' ద్వారా అంశాలు మెదడులో బలంగా ముద్రించబడతాయని, ఇది జాతీయ విద్యా విధానంలో ఒక ముఖ్య భాగమని వివరించారు. గతంలో బిర్లా ప్లానిటోరియం వంటి చోట్ల మాత్రమే ఇలాంటి సౌకర్యాలు ఉండేవని, ఇప్పుడు పాఠశాల స్థాయిలోనే నవరస్ ఎడ్యుటెక్ వంటి సంస్థల సహకారంతో విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుబాటులోకి రావడం గొప్ప పరిణామమని కొనియాడారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు నవోదయ విద్యాలయంలో 'అటల్ టింకరింగ్ ల్యాబ్' ద్వారా శిక్షణ పొంది, వికలాంగుల కోసం ఒక ప్రత్యేక పరికరాన్ని ఆవిష్కరించిన యువకుడి ఉదాహరణను ప్రస్తావిస్తూ, విద్యార్థులు ఇన్నోవేటివ్ ఐడియాలతో ముందుకు వస్తే, తెలంగాణ ఇన్నోవేషన్ కౌన్సిల్, 'టీ హబ్' వంటి వేదికల ద్వారా ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణ కేజీబీవీలో ఖగోళ, అంతరిక్ష ప్రయోగశాలను, గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అంతకుముందు పాఠశాల ప్రాంగణాన్ని అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, యు.ఎస్.పి. ఇండియా ప్రై.లి. ప్రతినిధి డాక్టర్ మృణాల్ జైవంత్, టిడిఎఫ్ ప్రతినిధులు రాజేశ్వర్ రెడ్డి, వినిల్ రెడ్డి, నవార్స్ ఎడ్యుటెక్ ప్రతినిధులు శశాంక కూన, అరుణ్, తహసీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, ప్రత్యేక అధికారులు కవిత, దీప్తి, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 23న అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కడప, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర:) జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఆంగన్‌వాడీ వర్కర్లు, ఆంగన్‌వాడీ హెల్పర్లు పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 23వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 30 ఆంగన్‌వాడీ వర్కర్లు (AWWs), 141 ఆంగన్‌వాడీ హెల్పర్ల (AWHs) పోస్టులకు సంబంధించి జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఆయా పరిధిలోని మండలాలకు అభ్యర్థులు 23-04-2026 (గురువారం) తేదీన ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.అభ్యర్థులు తమ అర్హతలకు సంబంధించి అవసరమైన పత్రాలు వెంట తీసుకొని నిర్ణీత సమయానికి హాజరు కావలసిందిగా సూచించడ మైనదన్నారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో పీడి పేర్కొన్నారు

## బీసీ గళం పోస్టర్ ను ఆవిష్కరించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్



పులివెందుల, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) జిల్లా పర్యటనలో భాగంగా పులివెందుల విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసారు అనంతరం వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు ఎమ్మెల్సీ ఆర్ రమేష్ యాదవ్ అధ్యక్షతన జూన్ 5 వైఎస్ఆర్సిపి బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ ఆదివారం అనంతపురం నందు నిర్వహించబోయే బీసీ గళం సమావేశం పోస్టర్ ను మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పార్టీ బీసీ లకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారికి ప్రత్యేక స్థానం ఉ ంటుందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైసీపీ పార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు

# పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగం: 'రివర్స్ టూరిజం

**'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'**

**కు జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి జూపల్లి**

**హైదరాబాద్ పయనమైన 250 మంది అడవి బిడ్డలు**

**మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్న ఆదివాసీ బృందం**

**తారామతి బారదరి లో సాదర స్వాగతం పలకనున్న పర్యాటక శాఖ అధికారులు**



ఉట్నూరు, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర:) రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు. **ఆదివాసీలతో మమేకమైన మంత్రి**కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. "బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.నగర నాగరికతకు - సంస్కృతికి వారధిఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,

## వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



పులివెందుల, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) పులివెందుల పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విచ్చేసిన సందర్భంగా ప్రొద్దుటూరు మాజీ శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వైయస్ జగన్మోహన్ రెడ్డికి పూల బొకేతో ఘనంగా స్వాగతం పలికారు ఈ సందర్భంగా రాచనమల్లు శివప్రసాద్ రెడ్డి పలు విషయాలపై జగన్మోహన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది అనంతరం జగన్మోహన్ రెడ్డి అందరిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని పలకరించారు ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు మండల అధ్యక్షులు మార్తల ఓబుల్ రెడ్డి, మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్ రెడ్డి, అనేకమంది ప్రొద్దుటూరు నుండి విచ్చేసిన నాయకులు,కార్యకర్తలు అభిమానులు, పాల్గొన్నారు

## చిన్నారులలో పౌషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషన్ పక్వాడ



సూర్యాపేట ఏప్రిల్ 22:(విజన్ ఆంధ్ర)చిన్నారులలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ సుబ్బలక్ష్మి అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డ సెక్టార్ హెచ్చిసి గోపాలపురం అంగన్వాడి సెంటర్ నందుసూర్యాపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిరుధాన్యాల ప్రయోజనాలు, వినియోగంపై అవగాహన కల్పించారు. వీటితో పాటు చిన్నారులకు కథలు, మెదడు పని తీరు, చిన్నతనంలోనే విద్యాభ్యాసం వంటి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ప్రతీ రోజు తీసుకునే ఆహారం స్థానంలో పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవడం వలన విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయన్నారు. దీంతో రక్తవృద్ధి ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెరుగడంతోపాటు జీవక్రియ మెరుగు పర్చడంతో శరీరం సమర్ధవంతగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మన్సూర్ బి ఫారూఖ్, అంగన్ వాడి టీచర్స్,సూపర్వైజర్ వీరమ్మ, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు తీర్పును స్వాగతించిన నామ



ఖమ్మం ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)కాళేశ్వరం కమిషన్‌పై తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు స్వాగతించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు చేపట్టవద్దన్న హైకోర్టు వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. కమిషన్ విధానంలో నిబంధనలు పాటించలేదన్న అంశాన్ని న్యాయస్థానం స్పష్టంచేయడం కీలక పరిణామమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల సాగునీటి పథకమని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని గతంలోనే తాను చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. దేశానికి గర్వకారణంగా, తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా నిలిచిన ఈ ప్రాజెక్టు బీడు భూములకు సాగునీరందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాక ప్రజల దాహార్తిని తీర్చిందని నామ వివరించారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు సాధించి భారత దేశ నీటి పారుదల రంగంలో సరికొత్త రికార్డులు సృష్టించిందన్నారు. ఈ ప్రాజెక్టు విశిష్టత గురించి తాను పలుమార్లు 17వ లోక్‌సభలో ప్రస్తావించానని, దీనికి జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాల్సిన అవసరాన్ని వివరించానని తెలిపారు. కాళేశ్వరం విషయమై నాడు లోక్‌సభలో మాట్లాడిన ప్రతి సారి కూడా పార్టీలకు అతీతంగా మద్దతు తెలిపారని, అటువంటి ప్రాజెక్ట్ విషయంలో రాజకీయం చేయడం సరికాదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ-స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం వల్ల లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు మరియు పరిశ్రమలకు నీటిని అందిస్తుందన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు పెరగడం కూడా గమనించదగ్గ విషయమని తెలిపారు. రైతన్నల కడగండ్లు తీర్చిన కాళేశ్వరం ప్రాజెక్ట్ సృష్టికర్త కేసీఆర్ పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని తక్కువచేసే ప్రయత్నాలు, కుట్రలను ప్రజలు ఏ మాత్రం అంగీకరించరని ఆయన స్పష్టం చేశారు.

# సింగరేణి ఆధ్వర్యంలో వరల్డ్ ఎర్త్ డే

భూపాలపల్లి జిల్లా : భూపాలపల్లి 23 ఏప్రిల్ ( విజన్ ఆంధ్ర ) బుధవారం వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఏరియా ఇంజనీర్ శ్రీ మాల ఎర్రన్న చేతుల మీదుగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏరియా ఇంజనీర్ శ్రీ మాల ఎర్రన్న మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రకృతి సంపదలను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి జీవన వాతావరణాన్ని అందించగలమన్నారు.సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి అనేక హరిత కార్యక్రమాలు చేపడుతోందని, ఉద్యోగులు, ప్రజలు కలిసి చెట్లను నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి సంరక్షణ వంటి చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా గత 20 సంవత్సరాలుగా జేవిఎస్ చంద్రశేఖర్, గ్రీన్ వారియర్, రిటైర్డ్ సింగరేణియన్ పర్యావరణం గురించి యూనివర్సిటీలలో, అటవీ శాఖలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ఉద్యోగులకు, విద్యార్థులకు ఎంతో జ్ఞానంతో కూడిన పరిజ్ఞానాన్ని అందిస్తున్నారని కొనియాడారు. తదుపరి చంద్రశేఖర్ కు శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఐ.ఈ.డి) జోతి, ఎన్విరాల్మెంట్ ఆఫీసర్ టి. పోషమల్లు, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి పాల్గొన్నారు.

# ఖమ్మంలో మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం..

ఖమ్మం, ఏప్రిల్ 22.( విజన్ ఆంధ్ర)భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయ దుమారాన్ని రేపాయి. ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో, నరేష్ గాడిల అధ్యక్షతన నగరంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద బీజేపీ శ్రేణులు ధర్నాకు దిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, మల్లికార్జున ఖర్గేకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధానిపై నోటిదురుసుగా ప్రవర్తించడం కాంగ్రెస్ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, మల్లికార్జున ఖర్గే తన స్థాయిని మర్చిపోయి తెలివి తక్కువ ప్రేలాపనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రధానిపై ఇటువంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని ఆయన విమర్శించారు. రాజకీయం అనేది ఎప్పుడూ గౌరవప్రదంగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ప్రధాని మోడీపై దేశ ప్రజలు చూపిస్తున్న అపరిమితమైన అభిమానాన్ని చూసి తట్టుకోలేక, అక్కసుతోనే కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన, ఖర్గే తన వ్యాఖ్యలకు గాను వెంటనే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని తరపున డిమాండ్ చేశారు.



## సింగరేణి ఉద్యోగులకు ఎండాకాల ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన




కొత్తగూడెం బ్యూరో, ఏప్రిల్ 23 (విజన్ ఆంధ్ర)సింగరేణి సంస్థకు చెందిన కొత్తగూడెం ఏరియాలోని పి వి కె నెం.5 ఇన్‌క్లైన్ మైన్‌లో ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమం హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 1వ మరియు 2వ షిఫ్ట్‌లలో జరిగింది. ఈ సందర్భంగా మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత ఉద్యోగులకు హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యలపై వివరించి, వాటి నివారణకు తగిన సూచనలు చేశారు. ముఖ్యంగా తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, ఎండలో ఎక్కువ సేపు పనిచేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి సూచనలు చేశారు.మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండి ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్, ఎ ఐ టి యు సి పిట్ సెక్రటరీ భూక్యా రమేష్, ఐ ఎన్ టి యు సి పిట్ సెక్రటరీ చిలక రాజయ్య తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సెలవుల్లో ఊరికి వెళ్తున్నారా జర భద్రం

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 ( విజన్ ఆంధ్ర ) : వేసవి సెలవుల్లో ఊరికి వెళ్తున్నారా.. అయితే జర భద్రంగా ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా సూచించారు. తాళం ఉన్న ఇంటిని గుల్ల చేసే దొంగలు సంచరిస్తుంటారు అని ఎస్పీ తెలిపారు. తమ చిన్నారులను ఒంటరిగా ఈతకు పంపించవద్దని జిల్లా ఎస్పీ హేతువు పలికారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు విహారయాత్రలకు వెళ్తున్న సందర్భంలో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. అలాగే ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో ప్రజలను అప్రమత్తం చేశారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో చాలామంది కుటుంబాలతో కలిసి బయటకు వెళ్తుండగా, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఇంటికి తాళం వేసి వెళ్లే వారు నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంటి చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంచవచ్చని తెలిపారు. నమ్మకమైన పొరుగువారికి బంధువులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయడం, ఇంటి వద్ద అప్పుడప్పుడు చూడమని అభ్యర్థించడం మంచిదని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఇంటి బయట లైట్లు వెలిగేలా ఆటోమేటిక్ టైమర్లు అమర్చుకోవడం, పోస్టులు లేదా పార్శిల్స్ పేరుకుపోకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం ద్వారా ఇంట్లో ఎవరూ లేరనే అనుమానం రాకుండా చూడవచ్చని తెలిపారు.అనుమానాస్పద వ్యక్తులు వాహనాలు కనిపించినపుడు వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల పట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. పిల్లలు సరదా కోసం చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లి ఈత కొట్టే ప్రమాదకర అలవాటు ఉన్నందున, తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తెలియని లోతైన నీటిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలను ఒంటరిగా నీటి వనరుల వద్దకు పంపకూడదని, ఎల్లప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండేలా చూడాలని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటుందని, అయినప్పటికీ ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి పై సూచనలు పాటిస్తే చోరీలు, ప్రమాదాలను నివారించవచ్చని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్



భూపాలపల్లి విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 :భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి రూరల్ మండలంలోని కమలాపూర్,నాగారం, ఆజంనగర్,నందిగామ,దీక్షకుంట, పంబాపూర్,గొల్లబుద్దారం,గొల్లబుద్దారం తండా గ్రామాలలో పి.ఏ.సి.ఎస్, మాక్స్ మరియు ఐ.కె.పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన గౌరవ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర 2389 రూపాయలతో పాటుగా బోనస్ 500 రూపాయలు ఉంటుందని తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల యొక్క ఆర్.పి.ఎం 18 నుండి 20 వరకు మరియు బ్లోయర్ ఆన్ లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియచేయాలని ఇలా చేయడం వలన ధాన్యంలో తాలు ఉండదని తెలిపారు.రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులకు సమయానికి డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అలాగే కొనుగోలు కేంద్రాలలో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు.రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని,ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్ గారు,డిఎం సివిల్ సప్లై అధికారి రాములు గారు, ఎమ్మార్వో, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులు,కొనుగోలు కేంద్రాల నిర్వహకులు మరియు రైతులు పాల్గొన్నారు

# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం

**ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలేవి?**

**-సేవా దృక్పథం ముసుగులో విద్యారంగాన్ని వ్యాపారమయం చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు**

**ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తూ సంఘటితంగా ఉద్యమిస్తాం**

**వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ**




హన్మకొండ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)బుధవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్, ఏ.ఐ.ఎస్.బి, పి.డి.ఎస్.యు, ఏ.ఐ.ఎస్.ఎఫ్, పి.డి.ఎస్.యు. వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ జరిగింది. ఈ ప్రెస్ మీట్ లో ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏ.ఐ.ఎస్.బి. రాష్ట్ర కార్యదర్శి హకీం నవీద్, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్, పి.డి.ఎస్.యు. హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ లు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికడుతామని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఫీజుల భారం లేకుండా చూస్తామని చెప్పిన మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు తక్షణమే ఆన్లైన్లో పెట్టాలని విద్యాశాఖ అధికారులకు చెప్పిన ప్రతిపాదనలు నేటికీ అమలుకు నోచుకోలేదు.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రభుత్వ నియమ ,నిబంధనలు యధేచ్ఛగా ఉల్లంఘిస్తూ కొనసాగుతున్న ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేయడంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సేవా దృక్పథం పేరిట విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ నేడు విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం చేశాయి. పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆశలను ఆసరాగా చేసుకుని వారికి అనేక మాయమాటలు ప్రచార ఆర్భాటాలతో అరచేతిలో వైకుంఠం చూపించి అడ్మిషన్ చేసుకొని ఆ తర్వాత అడ్మిషన్, బుక్స్ ,స్టేషనరీ, డెవలప్మెంట్, ల్యాబ్, లైబ్రరీ, గేమ్స్ మరియు ఐఐటి, నీట్ ఫౌండేషన్, ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్ ఫీజులు అంటూ అనేక రకాల ఫీజుల పేరుతో లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తూ, వారి రక్తాన్ని జలగల్ల జర్రుకుంటున్న స్థితి నెలకొంది. జిల్లాలో కలెక్టర్, డిఇఓ, స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ తో కలిపి డీ.ఎఫ్.ఆర్.సి. (జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ) సూచనల మేరకు ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు నిర్ణయించాల్సి ఉంటుంది.ప్రతి స్కూల్లో ప్రతి తరగతికి సంబంధించిన ఫీజుల వివరాలతో కూడిన బోర్డు కచ్చితంగా ఉండాలి. కానీ ఏ ఒక్క ప్రైవేటు విద్యాసంస్థ కూడా ఈ నిర్ణయాన్ని పాటించటం లేదు. పైగా డిఎఫ్ ఆర్ సి కి సంబంధం లేకుండానే ప్రతి సంవత్సరం ప్రైవేట్ విద్యా సంస్థలు 5 నుండి 10 శాతం వరకు ఫీజులు పెంచుకుంటూ పోతున్నారు.విద్యాసంస్థల్లో విద్యార్థుల వద్ద నుండి వసూళ్లు చేసినఫీజుల మొత్తంలో 50% ఆయా స్కూల్స్ లో బోధిస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల జీత, భత్యాలకు, 30% స్కూలు నిర్వహణ, అభివృద్ధికి, మిగతా 20 శాతం మాత్రమే స్కూల్ యాజమాన్యం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నప్పటికీ ఏ విద్యాసంస్థ యాజమాన్యం కూడా అమలుకు పూనుకోకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు స్కూల్స్ లో పనిచేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి పిఎఫ్ ఈపీఎఫ్ లాంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా లేబర్ చట్టాలను సైతం ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. సంబంధిత పిఎఫ్ ,లేబర్ అధికారుల పర్యవేక్షణ లోపం వలన ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఇతర సిబ్బందికి దక్కవలసిన బెనిఫిట్స్ దక్కకుండా పోతున్నవి. అంతేకాదు విద్య హక్కు చట్టం ప్రకారం ప్రతి విద్యా సంస్థ 25% సీట్లను ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్స్ కల్పించాల్సి ఉంది. కానీ ఏ ఒక్క విద్య సంస్థ కూడా విద్య హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన సిలబస్ ను పక్కనపెట్టి తమ ఇష్టారాజ్యంగా తమ సొంత సిలబస్ రూపొందించుకొని అమలు చేస్తూ బోధిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఒక విద్యా సంస్థ పేరు మీద పర్మిషన్ తీసుకొని, సంబంధిత విద్యాశాఖ అధికారుల వద్ద నుండి ఎలాంటి అనుమతి తీసుకోకుండా 4 నుండి 10 వరకు అదనపు బ్రాంచీలు నెలకొల్పుకొని వాటికి డిజి, టెక్నో,ఇ- టెక్నో, గ్లోబల్ ,ప్లే ,ఐఐటి, మెడికల్ ఫౌండేషన్, గ్లోబల్, లాంటి తోక పేర్లు తగిలించుకొని విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. రెసిడెన్షియల్ పర్మిషన్ లేకుండా హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. కనీసం ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండా అపార్ట్మెంట్లల్లో, ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. కింది నుండి పై వరకు సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలు ఇచ్చే ఆర్థిక తైలాలకు ఆశపడి చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఎన్నోసార్లు ఆందోళనలు నిర్వహించి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ, ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

## ఆర్టీసీ డిపో వద్ద అందోళన చేపట్టిన ప్రయివేట్ డ్రైవర్లు

**ఏసిపి ప్రకాష్ ఆకరణంగా చేయి చేసుకున్నాడని ఆరోపణ**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22,(విజన్ ఆంధ్ర)మంచిర్యాల ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ప్రయివేట్ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఒకవైపు ఆర్టీసీ కార్మికులు సమ్మె లో ఉంటే, మరోవైపు అద్దె బస్సు డ్రైవర్ దమెరా శేఖర్ ను ఏసీపీ ప్రకాష్ ఆకరణంగా చేయి చేసుకుని, దూర్భశాలాడారని డిపో వద్ద బైటయించి ఆందోళన చేపట్టారు.మరోవైపు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లను డిపో మేనేజర్ పిలిచి బస్సులు నడపాలని కోరగా అందుకు అద్దె బస్సు డ్రైవర్లు సమ్మె కొనసాగుతున్న తరుణంలో తమకేమైనా, బస్సుకు ఏమైనా జరిగితే బాధ్యత వహిస్తారా అని అడిగారు. అందుకు అధికారులు తమకేమి సంబంధం లేదని పేర్కొనడం తో అద్దె బస్సుడ్రైవర్లు తమ యజమానులను అడిగి బస్సులు తీస్తామని పేర్కొనగా అక్కడే ఉన్న మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ భద్రత తాము కల్పిస్తామని అన్నారు. దామెర శేఖర్ అనే అద్దె బస్సు డ్రైవర్ ఏసీపీ ప్రకాష్ తో బస్టాండ్ వద్ద అంటే భద్రత కల్పిస్తారు, ప్రయాణం మార్గామధ్యలో జరిగితే ఎలా అని అడగటం తో ఏందిరా నువ్వు ఎక్కువ మాట్లాడుతున్నావు అంటూ అద్దె బస్సు డ్రైవర్ పై సీరియస్ అయ్యారని,అంతే కాకుండా తమపై ఆకారణంగా చేయి చేసుకున్నాడని ఆరోపించారు.దీంతో ఏసీపీ ప్రకాష్ అద్దె బస్సు డ్రైవర్లకు నచ్చజేప్పి ఆందోళన విరమింప జేశారు.

## ధరిత్రి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




హన్మకొండ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు.బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా రూపొందించిన "ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ (ఏప్రిల్ 15 ' 30)" పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాతావరణ, భూ కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పనిలో పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని సూచించారు. పక్షం రోజుల పాటు నిర్వహిస్తున్నమదర్ ఎర్త్ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు మొక్కల నాటకం చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే ఏక వినియోగ ప్లాస్టిక్‌ను నివారించడం, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, పర్యావరణహిత కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ ర్యాలీలు, ఉదయ నడకలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వెంకట గిరిరాజ్ గౌడ్, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మరియు ఎన్‌జీసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస స్వామి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొందల వేణు మహేశ్వర రావుకి డాక్టరేట్



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ (కిట్స్‌డబ్ల్యూ)లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ (ఈసీఐఈ) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బొందల వేణు మహేశ్వర రావుకు తెలంగాణలోని కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసినది అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి సగర్వంగా తెలిపారు. ఈరోజు(బుధవారం) విడుదల చేసిన పత్రికా ప్రకటనలో లికిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, నా పర్యవేక్షణలో బొందల వేణు మహేశ్వర్ రావు ఈ అధునాతన సాంకేతిక పరిశోధనను ఈ ఐ ఈ విభాగం లో విజయ వంతంగా కొనసాగించారు. ఆయన లి"సిగ్నల్ ప్రాసెసింగ్ మెథడ్స్ ఫర్ పీపీజీ సిగ్నల్ ఎన్‌హాన్స్‌మెంట్ అండ్ అనాలిసిస్"లి అనే అంశంపై డాక్టరల్ థీసిస్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్ష విభాగం కు సమర్పించారని తెలిపారు. అదనపు మోషన్ సెన్సార్ల అవసరం లేకుండా వేవ్‌లెట్ ట్రాన్స్‌ఫార్మ్, అడాప్టివ్ ఫిల్టరింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి మోషన్ ఆర్టిఫాక్ట్‌లను సమర్థవంతంగా తొలగించే ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంపై ఆయన పరిశోధన కేంద్రీకృతమైంది. అలాగే, పీపీజీ సిగ్నల్స్ నుండి రెస్పిరేటరీ రేట్, బ్లడ్ ఆక్సిజన్ సాచురేషన్‌ను ఖచ్చితంగా అంచనా వేయడానికి ఎన్సెంబుల్ ఆధారిత మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ మోడల్‌ను రూపొందించారు. దీనితో పాటు, ఊబకాయాన్ని అంచనా వేయడానికి హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ ఆధారిత మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఆయన పరిశోధన పత్రాలు ప్రముఖ అంతర్జాతీయ జర్నల్స్, కాన్ఫరెన్స్‌లలో ప్రచురితమయ్యాయి అని సగర్వంగా తెలుపుతూ ముగించారు.ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, ఫార్మర్ రాజ్య సభ ఎం.పి., కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి గారు, హుస్నాబాద్ ఫార్మర్ ఎమ్మెల్యే & కిట్స్ అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్ గారు అండ్ ఏకశిల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు, శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు గారు & ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి గారు ఎఐ-ఎంఎల్ ఆధారిత బయో మెడికల్ సిగ్నల్ ప్రాసెసింగ్ రంగంలో అన్వయించ దగిన, సమాజానికి అవసరమైన వినూత్న సాంకేతిక పరిశోధనలు చేసినందుకు బొందల వేణు మహేశ్వర రావు గారిని శుభాకాంక్షలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, పరిపాలనా అధికారి, ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్, ప్రొఫెసర్ ఎస్. నరసింహ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ & ఈసిఐ ఈ విభాగం అధిపతి డాక్టర్ ఎం. రఘు రామ్, వీరితో పాటు డీన్లు, వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ పి. ఆర్.ఓ. డాక్టర్ డి. ప్రభాకరా చారి, కాకతీయ విశ్వవిద్యాలయం ద్వారా సాంకేతిక పరిశోధన పిహెచ్‌డి నీ పొందడం పట్ల బొందల వేణు మహేశ్వర రావును అభినందించి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచుకున్నారు

# వయోవృద్ధులు సామాజిక సేవలో ముందుండాలి : కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)వయోవృద్ధులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.బుధవారం హనుమకొండ జడ్పీ హాల్ ప్రాంగణంలో ఉన్న వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హనుమకొండ ఆధ్వర్యంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ (టెస్కాన్), హైదరాబాద్ సౌజన్యంతో రాగి జావ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, వయోవృద్ధులు డే కేర్ సెంటర్లలో అందుబాటులో ఉన్న పుస్తక పఠనం, ఫిజియోథెరపీ, వినోద కార్యక్రమాల వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. తమ జీవిత అనుభవాలను, వివిధ రంగాల్లోని జ్ఞానాన్ని సమాజానికి పంచాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వేసవికాలంలో వయోవృద్ధుల ఆరోగ్య రక్షణకు రాగి జావ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో కలిసి కూర్చొని మాట్లాడుకునే అవకాశం ఉందని, చెస్, క్యారమ్ వంటి ఆటలు, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణిలో సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ డే కేర్ సెంటర్‌లోని సేవలను పరిశీలించగా, నిర్వాహకులు వివరాలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ, వయోవృద్ధులకు చట్టపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి ట్రిబ్యునల్ వ్యవస్థ అందుబాటులో ఉందని చెప్పారు.ట్రిబ్యునల్ సభ్యురాలు అనితా రెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం ' 2007" ద్వారా వయోవృద్ధులకు అనేక హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయని, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఉన్న ట్రిబ్యునల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ అధ్యక్షులు దామెర నర్సయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం వరంగల్ అధ్యక్షులు, కార్యదర్శులు అన్సూరి చంద్ర మౌళి, దేవాచారి, బన్నూ ఆరోగ్యదా సేవా సొసైటీ కార్యదర్శి కిరణ్మయి, సి.డబ్ల్యూ.సి సభ్యులు కజాంపురం దామోదర్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాగులగాం నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కోన్ రెడ్డి మల్లారెడ్డి, సిరాజుద్దీన్, నీతా, శ్రీధర్, హసన్‌పర్తి, కాకతీయ యూనివర్సిటీ ప్రాంత సీనియర్ సిటిజన్స్ సంస్థల ప్రతినిధులు, వివిధ సంస్థల బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, ఏప్రిల్ 22,(విజన్ ఆంధ్ర): అర్హులైన పేదలు సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలనిమల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో, సీఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారులకు మంజూరైన సీఎం ఆర్ ఎఫ్ ఎల్ ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం ఆర్ ఎఫ్ పేదలకం ఓ వరమన్నారు. ఇందులో వినాయక్ నగర్ డివిజన్ కు చెందిన ఎల్. వరలక్ష్మి రూ 2,00,000, కే. లక్ష్మి రూ 1,10,000 మంజూరైనాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గుప్తా, నాయకులు ఇమ్రాన్ ఘోస్, మణిరత్నం, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న

### న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమా పూజిత



గద్వాల ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని బుధవారం గద్వాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమా పూజిత సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం బహుకరించారు

## అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన ఏఎస్పీ పి మౌనిక

### భుజస్కందాలపై సింహ తలాటం చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ.

### ఏఎస్పీ నుండి అదనపు ఎస్పీగా పదోన్నతి



పోలీసు ముఖ్య కార్యాలయం అదనపు ఎస్పీ అడ్మిన్ గా కొనసాగింపు.

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా పోలీసు కార్యాలయం అడ్మిన్ ఏఎస్పి గా ఉన్నటువంటి పి మౌనిక కి సోమవారం అదనపు ఎస్పీగా పదోన్నతి రాగా, బుధవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన పి మౌనిక కి పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భుజస్కందాలపై సింహ తలాటం చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలియజేశారు. ఇకనుండి పి మౌనిక పోలీసు ముఖ్య కార్యాలయం అదనపు ఎస్పీ అడ్మిన్ గా అదే స్థానంలో కొనసాగనుంది. జిల్లా పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా పదోన్నతి పొందిన మౌనిక కి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఆపరేషన్ బి సురేందర్ రావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ పోతారం శ్రీనివాస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సీసీ కొండరాజు, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాదెండ్ల మృతికి సిఎం, డిప్యూటి సిఎం సంతాపం

### మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించిన బాబు

అమరావతి,ఏప్రిల్ 22 మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. నాదెండ్ల ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భవవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. భాస్కరరావు తనయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు.. భాస్కరరావు కుటుంబసభ్యులకు సీఎం, మంత్రి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నాదెండ్ల భాస్కర రావు మృతిపై సంతాపం తెలిపారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను' అని డిప్యూటీ సీఎం పవన్ ఆవేదన చెందారు. నాదెండ్ల భాస్కరరావు 70వ దశకం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారన్నారు. న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదని చెప్పుకొచ్చారు. విజయవాడ ఈస్ట్, వేమూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా, ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచి సేవలందించారని గుర్తుచేశారు. 'నాదెండ్ల భాస్కర రావు కుమారుడు, నా సహచర మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్.. పితృ వియోగం బాధ నుంచి త్వరగా కోలుకోవాలి' అని కాంక్షించారు. మనోహర్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రాబోయే ఖరీఫ్ సీజన్ లో రైతులకు ..నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలి

### ...జిల్లా కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర) రాబోయే ఖరీఫ్ సీజన్‌లో జిల్లా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ బృందాలు, విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. రైతును మోసం చేసే ఏ ఒక్క డీలర్‌ను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, అనుమతి లేని విత్తనాలను విక్రయించినా, గడువు ముగిసిన ఎరువులను నిల్వ ఉంచినా లైసెన్స్‌లు రద్దు చేయడమే కాకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు.జిల్లాలోని విత్తన, ఎరువుల డీలర్లు ప్రతి విక్రయానికి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, దుకాణాల వద్ద స్టాక్ బోర్డులను ప్రదర్శించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే గ్రామాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాల లభ్యతపై వ్యవసాయ అధికారులు పక్కా ప్రణాళికతో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి, సరిహద్దు ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలో రైతులకు అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.విత్తన, ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మాట్లాడిన కలెక్టర్, డిమాండ్‌కు అనుగుణంగా నిల్వలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ధరల నియంత్రణను పాటించాలని, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వడ్లు కొనుగోల కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి

### వడ్లు డంపింగ్ ను సందర్శించిన బిఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు



గద్వాల ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)రైతులు పండించిన పంట కొనుగోలు చేయడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు. బుధవారం గద్వాల నియోజకవర్గం కేటీ దొడ్డి మండలం కొండాపురం గ్రామంలో వడ్ల డంపింగ్ ను రైతులు,పార్టీ నాయకులతో కలిసి,ఆయన సందర్శించారు. అనంతరం సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి,వెంటనే ఐకెపి సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సాగు నీళ్లు అందించడంలో వైఫల్యం,కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం, కాంటాలు పెట్టడంలో వైఫల్యం, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం, బడాయిగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యం చెందిందని అన్నారు.ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉంది అని మండిపడ్డారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు తీసుకున్నారు అని అన్నారు.కెసిఆర్ పంటలు కోతకంటే ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే వారని,పంటలు వేయకంటే ముందే పంట ఖర్చుల కోసం రైతు బందు ఇచ్చే వారని,పంట కొనుగోలు చేసాక వెంటనే డబ్బులు ఇవ్వడం తో పాటు బోనస్ కూడా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేవారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది అని,ప్రభుత్వ నిర్లక్ష్యం,నిర్వాహకుల అలసత్వం ఫలితంగా అన్నదాతలు అరిగోస పడుతున్నారు అని ఆరోపించారు.ఇంటిని వదిలి, రోజుల తరబడి రైతులు వరి కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి అక్కడే కాపాల కాస్తున్న పరిస్థితి ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలి అని మిల్లర్లు ఎక్కువ తరుగు తీయకుండా చూడాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు

### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



నిజామాబాద్, ఏప్రిల్ 22 :( విజన్ ఆంధ్ర) అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు జారీ అయ్యేలా తెలంగాణ మీడియా అకాడమీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎవరికీ అన్యాయం జరుగకుండా చూస్తామని భరోసా కల్పించారు. నిజామాబాద్ నగర ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు వెల్ నెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. న్యూ అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, జర్నలిస్టులకు లాంఛనంగా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ నాలుగవ విడత సమావేశం గురువారం జరగనుందని తెలిపారు. జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయుల అభ్యర్థనల మేరకు అక్రిడిటేషన్ల జారీ కోసం ఉద్దేశించిన 252 జీఓలో అవసరమైన సవరణలు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని అన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎవరూ ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, అర్హులైన వారందరికీ తప్పనిసరిగా అక్రిడిటేషన్లు జారీ అవుతాయని అన్నారు. స్పోర్ట్స్ జర్నలిస్ట్ లు, కార్టూనిస్టులు, ఫిలిం, కల్చరల్ జర్నలిస్టులకు కూడా కార్డులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా మీడియా అకాడమీ చర్యలు తీసుకుందని అన్నారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తారని చెప్పారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే విధి విధానాల కోసం సబ్ కమిటీ వేశామని, కమిటీ నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జర్నలిజంతో సంబంధం లేని వారికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రిడిటేషన్లు జారీ కాకుండా చూడాలన్నారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఉన్నాయని, ఇదివరకటి తరహాలోనే ఈసారి కూడా కార్డులు జారీ చేయబడతాయని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ విషయమై రెండు మూడు రోజుల్లోనే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రితో భేటీ ఉందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని నమ్మకం ఉందన్నారు. కాగా, జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చి హెల్త్ కార్డులు అందించిన వెల్ నెస్ ఆసుపత్రి యాజమాన్యాన్ని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కవితా రెడ్డి, డీపీఆర్ఓ పద్మశ్రీ, వెల్ నెస్ ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు అసద్ ఖాన్, ముబీన్ పటేల్, భార్గవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, సుభాష్, కోశాధికారి బి రాజకుమార్ సాక్షి ఫోటోగ్రాఫర్ కార్యవర్గ సభ్యులు, సితార కృష్ణ పబ్బు భూమేష్. రవి చరణ్ రెడ్డి. జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

### -- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఇచ్చోడ, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మంగళవారం నిర్వహించిన టెలిస్కోప్ ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్నతనం నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ టెలిస్కోపులను అందజేస్తోందని తెలిపారు. పుస్తకాలకే పరిమితం కాకుండా, టెలిస్కోపుల ద్వారా అంతరిక్షంలోని గ్రహాలు, నక్షత్రాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో ఇటువంటి ఆధునిక పరికరాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సైన్స్ అనేది కేవలం పాఠం కాదని, అది ఒక అన్వేషణ ప్రక్రియ అని పేర్కొంటూ, ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఆధునిక విద్యా పరికరాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ స్వయంగా టెలిస్కోప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు టెలిస్కోప్ లు, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, కేజీబివి ప్రత్యేక అధికారి మల్లిక,అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో 1738 ఎకరాల్లో పంట నష్టం

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప



అలంపూర్ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర)జిల్లాలోని ఐజ, రాజోలి మండలాల్లో రైతులు సాగు చేసిన వరి పంట మంగళవారం కురిసిన వర్షానికి 1738 ఎకరాలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మంగళవారం వడగండ్లతో కూడిన అకాల వర్షం కురవడంతో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ఐజ, రాజోలి మండలాల్లోని మాన్ ధొడ్డి, ననసూరు, పచ్చర్ల, చిన్న తాండ్రపాడు, ఉప్పల్, చిన్న ధన్వాడ తదితర గ్రామాలలో యాసంగి 2025-26 లో సాగు చేసిన వరి పంట మొత్తం విస్తీర్ణం లో 1738.34 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. 80% పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప మాన్ దొడ్డి గ్రామంలో రైతులు నష్టపోయిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఏడీఏ సక్రియ నాయక్, రాజోలి మండల వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, ఏఈఓ శ్వేత, తదితరులున్నారు.

## కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు

### సీ.ఎం.ఆర్ కేసులపై సమీక్ష సమావేశం

### నిర్వహించిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య




నిజామాబాద్ ఏప్రిల్22:( విజన్ ఆంధ్ర)కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హెచ్చరించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీఎంఆర్ కేసులపై సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని విపులంగా పరిశీలిస్తూ , విచారణ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కేసును ప్రాధాన్యతతో తీసుకుని నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సాక్ష్యాధారాల సేకరణలో నాణ్యత , బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు ఖచ్చితంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోనని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని , సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి , కే. శ్రీధర్ రెడ్డి ఇన్స్పెక్టర్ ఎస్బిఐ , ఎం.అశోక్ ఇన్స్పెక్టర్ ఎన్ఐబి , ఆర్. అంజయ్య ఇన్స్పెక్టర్ సి.సి.ఆర్.బి తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో లేడీస్ జిమ్ మరియు జుంబ స్టూడియో ఏర్పాటు కూనంనేని తో కలిసి ప్రారంభించిన టిడిపి సీసీ జనరల్ సెక్రెటరీ నాగ ల



సీతారాములుపాల్వంచ ప్రతినిధి ఏప్రిల్ 22. (విజన్ ఆంధ్ర)పాల్వంచ పట్టణ పరిధి 40 వ డివిజన్ లో లేడీస్ జిమ్ మరియు జుంబా స్టూడియో ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు .మేయర్ మూడ్ గాణేష్. డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత హాజరయ్యారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో అత్యధిక సదుపాయాలతో జిమ్ ఏర్పాటు చేయడం వల్ల హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అధ్యక్షులు యుగంధర్ రెడ్డి. ఉపాధ్యక్షులు వై వెంకటేశ్వర్లు. జిమ్ ట్రైనర్ సింధు. 6వ డివిజన్ కార్పొరేటర్ బిఎస్ రావు. 5 వడివిజన్ కార్పొరేటర్ నూకల సరిత. 2వ డివిజన్ కార్పొరేటర్ భవిత కిరణ్. 40 వ డివిజన్ కార్పొరేటర్ సాయిబాబా. 41వ డివిజన్ కార్పొరేటర్ అన్నపూర్ణ. 45వ డివిజన్ కార్పొరేటర్ దంతేబోయిన నరేష్. మాజీ పెద్దమ్మ తల్లి గుడి చైర్మన్ మహిపతి రామలింగం. యువజన కాంగ్రెస్ నాయకులు భారత్ మరియు పుర ప్రముఖులు. యువత. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావంఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం

హైదరాబాద్,ఏప్రిల్22:ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలి

**- క్యాబినెట్ సెక్రటరీ కోఆర్డినేషన్ సెంట్రల్ సెక్రటేరియట్**

**- వీసీకి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22,( విజన్ ఆంధ్ర ): కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ కోఆర్డినేషన్ సెంట్రల్ సెక్రటేరియట్ ఆదేశించారు.కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు, భూ సేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై క్యాబినెట్ సెక్రటరీ కోఆర్డినేషన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అటవీ శాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి బుధవారం హాజరయ్యారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో జిల్లా టాపర్లను సన్మానించిన జిల్లా కలెక్టర్ హరిత....



అసిఫాబాద్ ( విజన్ ఆంధ్ర ) ఏప్రిల్: 22 అద్యాపకుల కృషి విద్యార్థులు పట్టుదలతో చదివి ఇంటర్ ఫలితాలలో జిల్లాను మంచి స్థానంలో నిలబెట్టి జిల్లాకు మంచి పేరును తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అద్వర్యంలో ఇంటర్ ఫలితాలలో జిల్లా టాపర్లుగా నిలిచినా విద్యార్థులకు సన్మాన కార్యక్రమానికి జిల్లా మాధ్యమిక విద్యా శాఖ అధికారి రాందాస్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ 2026 ఫలితాలలో మారుమూల మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాదించి జిల్లాకు గర్వ కారణంగా నిలచారని అన్నారు. అద్యాపకుల కృషి విద్యార్థులు పట్టుదల , సమిష్టి కృషితో రానించారన్నారు. జైనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బై. పి. సి. విద్యార్థిని 967 మార్కులు సదించగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎం పి సి విద్యార్థి అఖిల్ సాయి వర ప్రసాద్ 984 మార్కులు , ప్రభుత్వ జూనియర్ కళాశాల బై పి సి ఉర్దూ మీడియం విద్యార్థిని శాభిన 881 మార్కులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల దాహేగాం సి ఇ సి విద్యార్థి ఎల్కరి సంతోష్ 9౮6 మార్కులు మొత్తం 15 మంది విద్యార్థులు జిల్లా టాపర్ లుగా నిలిచిన వారికి శాలువల తో సన్మానం చేశారు. ఈ కార్యక్రమములో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లి దండ్రులు, పాల్గొన్నారు.

# గ్రామీణ ఉచిత వేసవి శిక్షణ శిబిరం

**- జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం ఎ సత్తార్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 ( విజన్ ఆంధ్ర ) : గ్రామీణ ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడల అధికారి ఎంఏ సత్తార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడల శాఖ, వికారాబాద్ జిల్లా, వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 24వ నుండి జూన్ 07వ వరకు బాల బాలికలకు గ్రామీణ ఉచిత వేసవి శిక్షణ శాభిరములు ( క్రీడలు) నిర్వహించుటకు నిశ్చయించడం అయినది ఆసక్తి గల యువతీ యువకులు ఆన్లైన్ ఫోటోలు నందు నమోదు చేసుకోగలరు"http://satgasc.telangana.gov.in". కావున ఆసక్తి కలిగిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు సీనియర్ క్రీడాకారులు వారు నిర్వహించదలచిన క్రీడలు, ప్రదేశములు, గ్రామము మీ యొక్క మొబైల్ నెంబర్ తో సహా వివరాలతో కూడిన దరఖాస్తులను జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయము వికారాబాద్ జిల్లా ఇంటిగ్రేటెడ్ జిల్లా అధికారి కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్ రూమ్ నంబర్ 15 నందు, ఈ తేది: 24.04.2026 లోపు స్వయముగా అందచేయవలయునని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనము క్రీడా సామాగ్రి అందజేయబడును.

## ఎంపీపీ ఎస్ ఎస్ సి కాలనీపాఠశాలలో డిజిటల్ తరగతి గది ప్రారంభం



మల్హర్,ఏప్రిల్ 22 విజన్ ఆంధ్ర :దమండల కేంద్రమైన ఎంపీపీ ఎస్ ఎస్ సి కాలనీ తాడిచెర్ల పాఠశాలలో బుధవారం డిజిటల్ తరగతి గదిని ఘనంగా ప్రారంభించుకోవడం జరిగింది. విద్యలో సాంకేతికత విద్యార్థుల కు మరింత నాణ్యతను అందించేందుకు దోహదపడుతుందని ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ లక్ష్మణ్ బాబు అన్నారు. డిజిటల్ తరగతి గది తో పాటు లైబ్రరీ,ప్లే మెటీరియల్, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్, వెల్ పర్నిష్డ్ తరగతి గదులు,నాణ్యమైన విద్య బోధన ,వినూత్న కార్యక్రమాలు,అన్నిటిలో ముందంజలో ఉన్న ఎంపీపీ ఎస్సీ కాలనీ రానున్న విద్యా సంవత్సరంలో మరింత ముందుకు దూసుకెళ్లేందుకు సహకరించవలసిందిగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత తల్లిదండ్రులను కోరడం జరిగింది. ఈకార్యక్రమంలో తాడిచర్లప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి,ఎఎ పి సి చైర్మన్ సరిత,సిఆర్ పి సమత ఉపాధ్యాయులు అరుణ్ కుమార్,సురేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల, వేములవాడలో నిలిచిన ఆర్టీసీ చక్రాలు

**- సమ్మెతో వెలవెలబోతున్న బస్టాండ్లు**

**- ప్రభుత్వంతో చర్చలు విఫలం**

**- సమ్మె బాటలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్టీసీ కార్మికులు**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22 ( విజన్ ఆంధ్ర ): రాష్ట్రవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి.ఆర్టీసీ జేఏసీ నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించకపోవడంతో, అర్ధరాత్రి నుంచే కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టారు. ఫలితంగా జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు ప్రధాన డిపోలకు చెందిన బస్సులు బయటకురాకపోవడంతో ప్రజా రవాణా స్తంభించిపోయింది. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులు గడుస్తున్నా, ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసిందని జేఏసీనాయకులుమండిపడుతున్నారు. ఐఏఎస్ అధికారుల కమిటీ వేయడం సరికాదని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంఘాలఎన్నికలునిర్వహించాలని, కొత్త బస్సులను



ఆర్టీసీనే నడపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన సిరిసిల్లతో పాటు ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ డిపోల పరిధిలో కార్మికులు ఉదయాన్నే గేట్ల వద్ద బైఠాయించారు. 10 ఏళ్లుగా వేతనాలు పెరగక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కార్మికులు నినదించారు.భక్తులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు ఈ సమ్మెకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని, డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ స్పష్టం చేసింది.

# విద్యార్థుల వసతులు, విద్యా ప్రమాణాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి,**

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) ఎప్రిల్ 22 : సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం, విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని కేజీబీవీలు, ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల సమగ్ర అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో సంక్షేమ వారోత్సవాల సందర్భంగా బుధవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండలం రాకోండ కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రూ. 1 కోటి 54 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ అదనపు తరగతి గదులు ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామీణ మరియు పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కేజీబీవీలు, గురుకులాలు వంటి సంస్థలను బలోపేతం చేయడం ద్వారా సమాన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సారథ్యంలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పి, అన్ని కులాల, అందరూ విద్యార్థులకు సమాన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేలా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ తరగతి గదుల ద్వారా విద్యార్థులకు మరింత అనుకూలమైన విద్యా వాతావరణం కలుగుతుందని, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు .అనంతరం 8 గ్రామ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మరియు కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల ద్వారా సొంత ఇల్లు కల సాధనలో ప్రభుత్వం సహకారం అందిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, మండల విద్యాధికారి వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారి హసీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిత్యం తాగునీరు సరఫరా చేయాలి

**- ఈ వేసవిలో ఎక్కడా ఇబ్బంది రానీయవద్దు**

**- తాగునీరు సరఫరా, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22,( విజన్ ఆంధ్ర ): సిరిసిల్ల జిల్లా లోని వేములవాడ మున్సిపల్ పరిధిలో, అన్ని గ్రామాల్లో తాగునీరు నిత్యం సరఫరా చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేసవికాలం నేపథ్యంలో జిల్లాలో తాగునీరు సరఫరాపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖ పబ్లిక్ హెల్త్ అధికారులతో జిల్లాసమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీలు, అన్ని మండలాల వారీగా మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా లక్ష్యంఎంత సరఫరా అవుతుంది.స్థానికంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మిషన్ భగీరథ ఏఈలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తాగునీరు సరఫరా కోసం ఇంకా ఏమి కావాలో ఆరా తీశారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూప్రతి మున్సిపాలిటీ, గ్రామాల్లో తాగునీరు సరఫరా, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వేసవి నేపథ్యంలో రానున్న 45 రోజులు చాలా కీలకమని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా లక్ష్యం మేరకు నీటిని సరఫరా చేయాలనిఆదేశించారు.మున్సిపాలిటీలోని ప్రతి వార్డు, విలీన ప్రాంతాలు, అన్ని మండలాల్లోని గ్రామాలు, చివరి ప్రాంతాలకు నీరు సరఫరాలో ఎక్కడా ఇబ్బంది రాకుండా పక్కా ప్రణాళికతో ముందుకువెళ్లాలనిఆదేశించారు.నీటి టాంక్ లు, పైప్ లైన్ లలో లీకేజీ లేకుండా చూడాలని, ఇన్ టెక్ వెల్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్లలో మోటార్లు ఎప్పుడూ నడిచేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్ట్ లోనీటిమట్టాన్నిపరిశీలిస్తూ. ముందుకు వెళ్లాలని సూచించారు. నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు వస్తే స్థానికంగా



ఉన్న వనరులను వినియోగించాలని తెలిపారు. నీటిని రోజూ క్లోరినేషన్ చేయించాలని, ప్రతి పది రోజులకు ఒకసారి నీటి టాంక్ లు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అమృత్ పథకం కింద జిల్లాలో మొదలు పెట్టిన ఓ హెచ్ ఎస్ ఆర్ ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసి.. వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా అధికార యంత్రం దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ అమరేందర్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఆర్డీఓ గీత, సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొ.సారా నహీద్ కు ద బెస్ట్ ఎన్విరాన్మెంటలిస్ట్ అవార్డు-26 ప్రధానం




హైదరాబాద్, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : ధరిత్రిని కాపాడుకోవడం అంటే భావితరాల బంగారు భవితకు బాటలు వేయడమేనని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ అన్నారు. బుధవారం తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం పుస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ అక్తర్ అలీ, ప్రొ. ఫెసర్ డా.ముస్తఫా అహ్మద్ అమీర్ లతో కలసి ముఖ్య అతిథిగా ప్రొ.శ్రీరామ్ పాల్గొని ప్రసంగించారు. గత 35 ఏళ్లుగా వృక్షశాస్త్రంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న నాంపల్లిలోని సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రొఫెసర్ సారా నహీద్ కు ద బెస్ట్ ఎన్విరాన్మెంటల్ లిస్ట్ అవార్డు-2026 శాలువా, మెమెంటో, పూలమాల, ప్రశంస పత్రంతో ముఖ్య అతిధి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం కో-ఆర్డినేటర్లు జీ.వేణుగోపాల్, బిచ్చుకారి సూర్య, కె.రవీందర్, రామ్ కిషోర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# అద్దె బస్సులను నడుపుతున్నాం

**- ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22,(విజన్ ఆంధ్ర ): రాష్ట్ర వ్యాప్తంగా కొనగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె తో ఎక్కడికక్కడ బస్సులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుండి ఒక్క బస్సు కదలక పోయేసరికి ప్రయివేటు వాహనాల జోరు ఉపందుకుంది. రెండితల ఛార్జిలతో ప్రయాణికుల వద్ద వసూలు చేస్తూ అందినకాడికి దోచుకున్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఉదయం 11 గం ల తర్వాత ఆర్టీసీ లో 69 అద్దె బస్సు లను ప్రయివేట్ డ్రైవర్లతో నడిపించారు. మంచిర్యాల డిపోలో మొత్తం 146 బస్సులకు గాను, 69 అద్దె బస్సులు ఉండగా 77 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. ప్రతిరోజు సుమారు రూ, 25 నుంచి 30 లక్షల ఆదాయం వచ్చే ఆర్టీసీ కి సమ్మె ప్రభావం తీవ్రంగా పడనుంది. తాత్కాలికంగా కండక్టర్, డ్రైవర్లను అర్హతలను బట్టి నియమించుకోవడం జరుగుతుందని డిపో మేనేజర్ తెలిపారు.

# మే నెలలో సదరం శిబిరాల నిర్వహణ.

**-వివరాలు వెల్లడించిన హాస్పిటల్ సూపరింటెండెంట్**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22,( విజన్ ఆంధ్ర ): జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో మే 2026 నెలలోనిర్వహించబోయే సదరం శిబిరాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. వివిధ రకాల వైకల్యాలు కలిగిన వారి కోసం కేటాయించిన తేదీలు మరియు విభాగాల వివరాలు ఇలా ఉన్నాయిశిబిరాల షెడ్యూల్ మే 02, 04, 05 తేదీలలో అర్థోపెడిక్ ఎముకల సంబంధిత ఒక్కో రోజు 50 మందికి.మే 05వ తేదీన చెవి, ముక్కు, గొంతు ఈ ఎన్ టీ 23 మందికి. మే 06వ తేదీన మానసిక వైకల్యం 17 మందికి.మే 06, 07 తేదీలలో కంటిచూపు సంబంధిత వరుసగా 15, 14 మందికి మే 12, 13 తేదీలలో జనరల్ వైకల్యాలు 12 మందికి.శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లు, అవసరమైన ఎక్స్-రేలు, యూ డి ఐ డి అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో ఫోన్ నెంబర్ వెంట తెచ్చుకోవాలి. పైన తెలిపిన తేదీలలో ఉదయం 09:00 గంటలకేక్యాంపునకు హాజరుకావాలని సూచించారు.ఈసమాచారాన్ని సంబంధిత మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని దివ్యాంగులకు చేరవేసి, వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు.

# ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యలపై మంత్రి హామీ విజయవంతమైన చర్చలు

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో హెల్త్ మినిస్టర్ ని కలిసి ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుమారు 25 నిమిషాల పాటు విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా క్రింది అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు:ఫార్మర్ (104) ఎఫ్డిహెచ్ఎస్ ఫార్మసీ ఆఫీసర్స్‌కు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలి ఎం.హెచ్.ఎస్.ఆర్.బి ద్వారా పరీక్షలు రాసిన 732 మంది ఫార్మసీ ఆఫీసర్స్‌కు ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేసి ఖాళీలన్నీ భర్తీ చేయాలి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులు సృష్టించాలి మందులు ఉన్న ప్రతి కేంద్రంలో ఫార్మసీ చట్టాల ప్రకారం ఫార్మసీ ఆఫీసర్స్ నియామకం తప్పనిసరి చేయాలి పల్లె, బస్తీ దవాఖానాల్లో 3000 పోస్టులు భర్తీ చేయాలి జిల్లా ఆసుపత్రుల్లో క్లినికల్ ఫార్మసీ విభాగాలు ఏర్పాటు చేయాలి ఐ ఎఫ్ ఎం ఎస్×



పోర్టల్‌లో హోదాలు జి .ఓ . మాస్ . నెంబర్. 71 ప్రకారం సవరించాలి అడ్‌హాక్ ప్రమోషన్లు, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్‌కు తక్షణ పదోన్నతులు ఇవ్వాలి ప్రత్యేకంగా డైరెక్టర్ ఆఫ్ ఫార్మసీ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలి ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ (హెల్త్, మెడికల్ & ఫ్యామిలీ వెల్ఫేర్) మరియు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీలను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అలాగే పి.ఆర్.సి కమిటీ చైర్మన్ శివశంకర్ ని కలిసి వినతి పత్రం అందజేసి సుమారు 30 నిమిషాల పాటు చర్చలు జరిపారు. ఫార్మసీ ఆఫీసర్స్‌కు విద్యార్హతలు, విధుల ఆధారంగా కనీస బేసిక్ పే ₹50,000 ఉండాలని, ప్రస్తుతం ₹31,270 మాత్రమే ఉండడం అన్యాయమని తెలియజేశారు. ఫార్మసీ క్యాడర్‌కు డాక్టర్లతో సమానమైన మెరుగైన వేతనాలు కల్పించాలని కోరారు. దీనిపై చైర్మన్ గారు సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు , స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్ , హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎ.వి. శ్రీహరి మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గుడి నుంచి షాపు వరకూ చోరీలు

నిందితుడు అరెస్ట్

కొత్తగూడెం బ్యూరో ఏప్రిల్ 23(విజన్ ఆంధ్ర) : కొత్తగూడెం పట్టణ పరిధిలో ఇటీవల జరిగిన రెండు దొంగతనాల కేసులను పోలీసులు వేగంగా ఛేదించారు.బుధవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వివరాలు వెల్లడించారు. తేదీ 20-04-2026 అర్ధరాత్రి సమయంలో పోచమ్మ గుడిలో దొంగతనం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి హుండీని పగలగొట్టి అందులో ఉన్న రూ.300 నగదు అపహరించడంతో పాటు అమ్మవారి త్రిశూలాన్ని దొంగిలించాడు. ఈ ఘటనపై కొత్తగూడెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. అదే రోజు అర్ధరాత్రి రామవరం పునందాసు గడ్డలోని భూక్య లావణ్యకు చెందిన కిరాణా దుకాణంలో కూడా దొంగతనం జరిగింది. ఈ ఘటనలో కొన్ని మద్యం బాటిళ్లు మరియు రూ.4,000 నగదు దొంగిలించబడినట్లు ఫిర్యాదు అందడంతో మరో కేసు నమోదు చేశారు. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా కొత్తగూడెం టూ టౌన్ సీఐ గారు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో అనుమానాస్పదంగా సంచితో తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతను మర్రిగూడెం గ్రామానికి చెందిన మడివి భద్రయ్య (రా/శీ సింగయ్య)గా గుర్తించారు. విచారణలో మడివి భద్రయ్య పై రెండు దొంగతనాలకూ తానే బాధ్యుడని ఒప్పుకున్నాడు. పోచమ్మ గుడిలో



హుండీని పగలగొట్టి రూ.300 దొంగిలించానని, ఇంకా ఏమైనా దొరుకుతుందేమోనని వెతుకుతుండగా అమ్మవారి చేతిలో ఉన్న త్రిశూలాన్ని బలంగా లాగడంతో విగ్రహం చేయి విరిగిందని తెలిపాడు. అలాగే రామవరం ప్రాంతంలోని కిరాణా షాపులో చోరీ చేసి మద్యం బాటిళ్లు మరియు రూ.4,000 నగదు దొంగిలించినట్లు అంగీకరించాడు. నిందితుడు కొంత మద్యం అమ్మగా, అతని వద్ద నుండి 13 క్వార్టర్ మద్యం బాటిళ్లు మరియు రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి సీజ్ చేసిన అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులను వేగంగా ఛేదించిన కొత్తగూడెం టూ టౌన్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించండి

**- గతేడాది కొనుగోళ్ల ఆధారంగా ఏర్పాట్లు చేయండి**
**- కేంద్రాల వద్ద టార్పాలిన్ తప్పనిసరి**
**- మండలాల్లో అధికారులు సంయుక్త తనిఖీలు చేయండి**
**- రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి**
**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) ఏప్రిల్ 22.యాసంగి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం చిగురుమామిడి మండలం పీచుపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కొత్తపల్లి మండలం మల్కాపూర్ లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్, ఆర్డీవో మహేశ్వర్, సివిల్ సప్లై ఆఫీసర్ నర్సింగరావు, డీఎం రజనీకాంత్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అన్ని



ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని అన్నారు. అకాల వర్షాల కారణంగా ఎటువంటి నష్టమూ వాటిల్లకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో తూకం, తేమయంత్రాలు సరిగ్గా పనిచేసేలా చూడాలని, ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే మరొకటి ఏర్పాటు చేయాలని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వీలైనంత మేర ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోలు చేపట్టాలన్నారు. రైతులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కిట్లు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎం సేవలు అందుబాటులో ఉండాలని అన్నారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాల్లో రోజువారీగా ధాన్యం కొనుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తూ ప్రస్తుత యాసంగి కొనుగోళ్లకు అదేవిధంగా సన్నద్ధం కావాలని సూచించారు. ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలిలి మండలాల వారీగా ధాన్యం కొనుగోళ్లను మండల ప్రత్యేక అధికారులు,రెవిన్యూ, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని,కొనుగోళ్ల రిజిస్టర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అన్నారు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సమన్వయంతో కొనుగోలు పూర్తయిన ధాన్యం త్వరితగతిన మిల్లింగ్ కోసం వెళ్లేలా చూడాలని, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు.ఈ సందర్భంగా ధాన్యం కుప్పలు, రికార్డులు పరిశీలించి.సిబ్బందికి పలు సూచనలు చేశారు. యంత్రంతో ధాన్యంలోని తేమశాతం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని డీసీఎస్వోను ఆదేశించారు. కార్యక్రమంలో తహసిల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈతసరదా-విషాదంగామారకుండా జాగ్రత్త పడుదాం

**-మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దు చిన్న నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీయవచ్చు**
**-వేసవి సెలవుల దృష్ట్యా పిల్లల కదలికలు తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి**
**-ఎస్పీ మహేష్ బి. గితే.**



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22 ( విజన్ ఆంధ్ర ): వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు,యువకులు ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువల వద్దకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నందున ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదు అని జిల్లా ఎస్పీ సూచించారు. ఈత రానివారు బావులు, చెరువులు, కాలువల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. ఈతను నేర్చుకునే వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే నేర్చుకోవాలని ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.ఏదైనా అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటే పిల్లల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ విషయంలోనిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు.మైనర్ లకు వాహనాలు ఇవ్వకండి జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచడం జరిగినదని తల్లిదండ్రుల, మైనర్లకు వాహనం ఇవ్వకూడదని,వాహనం ఇచ్చినచో వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలుజరుగుతున్నాయని,దానితో వారికి మరియు ఎదుటి వ్యక్తులకు ప్రమాదం జరగటం వల్ల రెండు కుటుంబాలు నష్ట పోతున్నాయని కావున మైనర్ లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్ కు వాహనం ఇచ్చి ఏదైనా ప్రమాదం జరిగిన లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తూ వాహనం తో పట్టుబడిన వాహన యజమాని పై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# జనగణన కార్యక్రమం జాగ్రత్తగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22,(విజన్ ఆంధ్ర ) : జనగణన -2027 కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల గణనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం చేపట్టాలని, జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ వివరాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుండి నిర్వహించనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. రోజురోజుకు ఉష్ణోగ్రత తీవ్రమవుతున్న దృష్ట్యా ఉదయం వేళలో ప్రక్రియ నిర్వహించేలా కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. తమ జాబితాలోని ఇండ్ల గణన కొరకు ముందుగా ఆయా ఇండ్ల యజమానులకు సమాచారం అందించినట్లయితే



సమయానికి అందుబాటులో ఉంటారని, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమయపాలన పాటించాలని, ఇండ్ల గణన కొరకు నియమించబడిన అధికారులు ఎన్నికల విధులు నిర్వహించారని, అనుభవంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు అందిస్తున్న శిక్షణలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రక్రియ నిర్వహించే సమయంలో తలెత్తే సందేహాల నివృత్తి కొరకు గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణకు హాజరు కాని వారు తరువాత ఏర్పాటు చేసే శిక్షణ కార్యక్రమానికి హాజరై ఇండ్ల గణన ప్రక్రియపై అవగాహన పొందాలని తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ఎన్నికల నిర్వహణ జనగణన పై ఆధారపడి ఉంటుందని, ఈ నేపథ్యంలో ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

డిగ్రీ కళాశాల తరగతి గదుల నిర్మాణ పనులు పరిశీలిస్తూ....

అంతకుముందు మండలంలోని కిష్టంపేటలో గల డిగ్రీ కళాశాల లో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెన్నూర్ పట్టణంలో చేపట్టిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, భోజనశాల, వంటశాల లను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎం పి ఎస్ ఓ ప్రవీణ్ కుమార్, ఫీల్డ్ ట్రైనర్లు సురేందర్, గోపికృష్ణ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దతూండ్ల లో శ్రీ మల్లికార్జున కూలింగ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

మల్హర్, ఏప్రిల్ 22 విజన్ ఆంధ్ర : మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలో బుధవారం శ్రీ మల్లికార్జున కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను ఘనంగా ప్రారంభించారు. పురోహితులు అనసూరి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఈ ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులకు స్వచ్ఛమైన, చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు నార



రమేష్, మలహార్ యూత్ ఉపాధ్యక్షులు బండ రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు మందపల్లి శ్రీధర్, కోట సురేష్, పైడకుల చంద్రు, తిప్పర్తి ప్రసాద్, ఊరుగొండ శేఖర్, పూసల రవి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ప్రవేశ పరీక్షల ఆలస్యాన్ని తగ్గించేందుకే విద్యార్థులకు అందు బాటులోకి వివిధ రకాల విద్యా సదు పాయాలు

**- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణా రెడ్డి**



విజన్ ఆంధ్ర(22) హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఈవిద్యా సంవత్సరం నుంచి, తొలిసారిగా ఐదు సంవత్సరాల సమగ్ర ఇంటిగ్రేటెడ్ కోర్సుల ప్రవేశాలను, డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్. తెలంగాణ (దోస్త్ ఏశీర్) ద్వారా నిర్వహించ బోతున్నామని ప్రకటించింది, ఇప్పటి వరకు ఐదు సంవత్సరాల సమగ్ర కోర్సులలో ప్రవేశాలు కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష ద్వారా నిర్వహించ బడుతుయి. అయితే ప్రవేశ ప్రక్రియలో ఆలస్యాన్ని నివారించేందుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మరియు రాష్ట్ర విశ్వ విద్యాలయాల వైస్ చాన్సలర్లు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు అని, దీనివల్ల రాష్ట్ర విశ్వ విద్యాలయాలు మరియు అనుబంధ కళాశాలలు అందించే వివిధ ఐదు సంవత్సరాల సమగ్ర అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు ఇకపై (డిఓ ఎస్ టి) ప్లాట్ ఫారమ్ ద్వారా జరుగుతూ, రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాలు మరియు సంస్థలలో బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫార్మా స్యూటికల్ కెమిస్ట్రీ, అప్లైడ్ ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో మొత్తం 370సీట్లు అందు బాటులో ఉన్నాయని, ఈఅవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించు కోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాల కృష్ణారెడ్డి కోరారు, ఈకోర్సులను కాకతీయ, పాలమూరు, తెలంగాణ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాల నుండి, మరియు తెలంగాణ గిరిజన సంక్షేమ రెసి డెన్షియల్ డిగ్రీ కళాశాలలతో పురుషులు, మహిళలకు అందిస్తున్నామని, ఇంటర్మీడియట్ లేదా సమాన అర్హత కలిగిన విద్యార్థులు ఈ ఐదు సంవత్సరాల సమగ్ర కోర్సులకు దరఖాస్తు చేసు కోవడానికి అర్హులుగా, కోర్సుల ద్వారా విద్యార్థులు ఒకే నిరవధిక ఐదు సంవత్సరాల విద్యా వ్యవధిలో, అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను పూర్తి చేసుకునే అవకాశం పొందుతారని తెలిపారు, విద్యార్థులు మరియు తల్లి దండ్రులు ఈ ముఖ్యమైన మార్పును గమనించి, ప్రవేశాలకు సంబంధించిన ప్రకటనలు, షెడ్యూల్‌లు మరియు మార్గ దర్శకాలను అధికారిక దోస్త్ వెబ్ సైట్‌లో పరిశీలించాలని, ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ రసాయన శాస్త్రం, ఎంఏ అప్లైడ్ ఎకనామిక్స్, ఇంటి గ్రేటెడ్లు ఐదు సంవత్సరాలు వర్తిస్తాయని, బాల కృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు

# శిక్షణలతోనే క్రమశిక్షణ...

**- జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా**

వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర): పోలీసులు ఆయుధాల వినియోగంలో శిక్షణ పొందడం ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ధైర్యం, క్రమశిక్షణ అలవడుతుందని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా అన్నారు. వార్షిక మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో కొత్రేపల్లి శివారులో ఆయుధాల ఫైరింగ్ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని క్షేత్రస్థాయిలో పలు రకాల ఆయుధాలను ఫైరింగ్ చేసి వాటి



పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వృత్తి పరంగా నైపుణ్యాన్ని పెంచుకునేందుకు పోలీసు అధికారులతోపాటు, సిబ్బంది నిరంతరం కృషిచేయాలని సూచించారు. ప్రజా భద్రతే పోలీసుల ముఖ్య లక్ష్యంగా ఉన్నందున



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుని ఆయుధాల వినియోగంపై పూర్తి అవగాహన కల్గి ఉండాలని అన్నారు. ఎప్పటికప్పుడు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ వీరేష్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

**- మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్**



మల్కాజిగిరి, ఏప్రిల్ 22,(విజన్ ఆంధ్ర): డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నానని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పి వి ఎన్ కాలనీ సాయిబాబా టెంపుల్ దగ్గర సుమారు 6 లక్షల రూపాయలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన, కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకుని వస్తే తప్పకుండా పరిష్కరిస్తానని స్థానికులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బాబు సత్యనారాయణ సంపత్ రావు కిషోర్, రాంరెడ్డి,రాజ్ కుమార్,అజయ్,సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలి

**- రవికుమార్ యాదవ్**

శేరిలింగంపల్లి .ఏప్రిల్ 22: (విజన్ ఆంధ్ర) : ఆర్టీసీ కార్మికుల తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని హెచ్‌సీయూ డిపో మరియు మియాపూర్ డిపో గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ సంపూర్ణ మద్దతు తెలియచేసారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు.. యూనియన్లను పునరుద్ధరించాలని, 2021, 2025 వేతన సవరణ, 2017 పీఆర్సీ బకాయిలు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సహా అన్ని సమస్యలను ఈ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎన్నో ఏండ్లుగా ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందిస్తున్న కార్మికులను గతంలో



బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వారి డిమాండ్లను పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసం అని ఇకనైనా ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,రాము, రాఘవేంద్ర,దరగయ్య, సుభాష్ గౌడ్, శ్రీనివాస్, రాజాబాబు మొదలగు వారు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

**- తహసీల్దార్ కె రవి కుమార్**

మల్హర్, ఏప్రిల్ 21 విజన్ ఆంధ్ర : మండల కేంద్రంలోని దుబ్బపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలను మంగళవారం తహసీల్దార్ కె. రవి కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని కిచెన్ రూమ్ ను సందర్శించి, వంట సామగ్రిని మరియు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించకూడదని, వంట గదిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో పాఠశాల సిబ్బంది మరియు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయం...

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

అసిఫాబాద్ ( విజన్ ఆంధ్ర ) ఏప్రిల్ 22, 2026: జిల్లాలోని కెరమెరి మండలం సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం కెరమెరి మండలం సావర్ కేడ గ్రామంలోని ప్రధానమంత్రి శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయమని, ఇది ఐ ఎస్ ఓ సర్టిఫికెట్ పొందడానికి అర్హత ఉన్న గ్రామంగా అభివర్ణించారు.





పాఠశాలలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయడం ద్వారా విద్యార్థులను సామర్థ్యాలు పెంపొందించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు లక్ష్యాన్ని ఎంచుకొని ఏకాగ్రతతో పనిచేస్తే సావరఖేడ స్ఫూర్తితో మరిన్ని పాఠశాలలో తయారవుతాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.